# ప్రజా తపన

prajathapana.com

News that matters





సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానం గా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 123 బుధవారం 28 జూన్ 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


## మోడీ నోట... యూనిఫాం సివిల్ కోడ్ మాట

**భోపాల్**



కుటుంబంలో ఒకరికి ఓ రూల్... ఇంకొకరికి ఇంకో రూల్ ఉండదు కదా. ఇంట్లో ఉండే అందరికీ ఎలా అయితే ఒక రకమైన రూల్స్ ఉంటాయో దేశం మొత్తం కూడా అలానే ఒకే రూల్ ఉండాలనేది ప్రధాని నరేంద్ర మోదీ చెబుతున్న మాట. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ లో జరిగిన బూత్ కార్యకర్తల సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ యూనిఫాం సివిల్ కోడ్ అంశాన్ని మరో సారి లేవనెత్తారు. బట్ ఈ సారి ఆయన ఈ టాపిక్ ను ఎత్తిన సందర్భం గురించి ఆలోచించాలి. ప్రధాని మోదీ అమెరికా పర్యటనను ముగించుకుని వచ్చిన తర్వాత ఆయన పాల్గొన్న తొలి బహిరంగ సభలోనే బీజేపీ కోర్ సిద్ధాంతాల్లో ఒకటైన ఆచరణలో తీసుకురావాలనే ఉన్న ఆకాంక్ష ఉన్న యూనిఫాల్ సివిల్ కోడ్ ఉమ్మడి పౌరస్మృతి గురించి మోదీ మాట్లాడారు. అమెరికా, ముస్లిం ప్రభావిత ఈజిప్ట్ లాంటి దేశాల్లో మోదీకి దక్కిన విశేష ఆదరణ, క్రేజ్ ప్రధాని మోదీ కాన్ఫిడెన్స్ కి కారణమై ఉండొచ్చు కానీ...ముస్లింలను కేవలం ఓటు బ్యాంకులానే భావించటం లేదనే బలమైన సందేశాన్ని మోదీ ప్రజల్లోకి తీసుకువెళ్లే ప్రయత్నం చేశారు. అసలు ఏంటీ ఉమ్మడి పౌరస్మృతి...స్వతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లైనా ఇంకా ఎందుకు దేశంలో ఒక్కో మతానికి ఒక్కో ప్రత్యేకమైన అధికారాలు, చట్టాలు ఉన్నాయి. ఆ వివరాలపై ఓ లుక్కేయండి .యూనిఫామ్ సివిల్ కోడ్ అంటే సింపుల్ గా చెప్పాలంటే.. సాధారణంగా దేశంలో రెండు రకాలైన చట్టాలు ఉంటాయి. మె?దటిది క్రిమినల్ లా ముందు. ఉదాహరణకు ఎవరైనా దొంగతనం

03

## కొత్త ఉదయం దిశగా.. క్రాంతి మార్గంలో దేశం నడవాలి

**కొత్తగా స్వాతంత్ర్య పోరాటం చేపట్టాలి**


**మహారాష్ట్ర సర్కోలిలో జరిగిన సభలో తెలంగాణా ముఖ్యమంత్రి కెసిఆర్**



**సర్కోలి :**

మహారాష్ట్రలోని సర్కోలిలో జరిగిన సభలో తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ మాట్లాడారు. ఈ దేశానికి లక్ష్యం ఏమైనా ఉందా అని ఆయన ప్రశ్నించారు. లేకుంటే ఊరికే ఉన్నామా అని అడిగారు. మేం ఎవరి టీమ్ కాదు.. మాది కిసాన్ టీమ్ అని సీఎం కేసీఆర్ అన్నారు. ఇదే సరైన సమయం అని, లక్ష్యం గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. కొత్తగా స్వాతంత్ర్య పోరాటం చేపట్టాలని, కొత్త ఉదయం దిశగా.. క్రాంతి మార్గంలో దేశం నడవాలన్నారు. సౌత్ కొరియా, జపాన్, సింగపూర్ మలేషియా, లాంటి చిన్న దేశాలు ఎంతో ప్రగతి సాధించినట్లు సీఎం కేసీఆర్ తెలిపారు. చైనా.. ఓ దశలో పేద దేశమని, కానీ ఇప్పుడు చైనా ఎలా ఉందా తెలుసా అని ప్రశ్నించారు. మనం ఎక్కడ ఉన్నామని ఆయన ప్రశ్నించారు. దీనిపై ఆలోచించాల్సి అవసరం ఉందన్నారు. మహారాష్ట్రలో ఏ పార్టీకి అధికారం రాలేదో చెప్పండి.. కాంగ్రెస్, శివసేన, బీజేపీలకు ప్రజలు అధికారం ఇచ్చారని, చేయాలనుకుంటే ఎవరైనా చేస్తారని, కానీ ఆ పార్టీలు ఏమీ చేయలేకపోయినట్లు సీఎం కేసీఆర్ తెలిపారు.రైతుల మంచి కోసం ఏదైనా చేయవచ్చు అన్నారు మహారాష్ట్ర పెద్ద రాష్ట్రం.. ధనవంతమైన రాష్ట్రం అన్నారు. మహా నేతలు దివాళా తీస్తారని.. కిసాన్లకు దివాళీ వస్తుందన్నారు. తనకు మరాఠీ రాదు అని, కానీ అన్నీ అర్థం చేసుకోగలనన్నారు. భారత్ పరివర్తన్ మిసన్

03



## పవన్ కళ్యాణ్ కు అనారోగ్యం


**కాకినాడ:**

నసేన అధినేత, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అనారోగ్యానికి గురయ్యారు. వారాహి విజయ యాత్రలో భాగంగా అవిశ్రాంతంగా అవిశ్రాంతంగా పర్యటనలు చేస్తుండడం, దీనికి తోడు ఉపవాస దీక్ష పాటిస్తుండడంమతో పవన్ ఇబ్బంది పడుతున్నట్లు జనసేన వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆయన పశ్చిమ గోదావారి జిల్లా పెద అమిరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పవన్ విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ కారణంగా భీమవరం నియోజకవర్గ నేతలో నిర్వహించాల్సిన సమావేశాన్ని వాయిదా వేశారు. మధ్యాహ్నం తర్వాతే ఈ భేటీ ప్రారంభం కానున్నట్లు తెలుస్తుంది. మరోవైపు పవన్ కల్యాణ్ అనారోగ్యానికి గురయ్యారని తెలియగానే ఆయన అభిమానులు ఆందోళనకు గురయ్యారు. అయితే స్వల్ప ఇబ్బంది మాత్రమే ఉన్నట్లు పార్టీ వర్గాలు స్పష్టతనివ్వడంతో కాస్త కుదుట పడ్డారు. కాగా ఇటీవల వరుసగా సినిమా షూటింగుల్లో పాల్గొన్న పవన్ కల్యాణ్ ఆ వెంటనే వారాహి విజయ యాత్ర చేపట్టారు. ఇప్పటికే తూర్పుగోదావరి జిల్లాను చుట్టేసిన ఆయన ఇప్పుడు పశ్చిమ గోదావరి జిల్లాలో

02

## ఇక తెలుగులో జేఈఈ

**ప్రజా తపన ,న్యూఢిల్లీ:**



జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్(జేఈఈ) అడ్వాన్స్‌డ్ కు హాజరయ్యే తెలుగు విద్యార్థులకు శుభవార్త. జేఈఈ మెయిన్‌ను తెలుగు రాసుకునేలాగానే.. ఇకపై జేఈఈ అడ్వాన్స్‌డ్‌ను కూడా తెలుగులో రాసుకోవడానికి అవకాశం కలగనుంది. ఇందుకు సంబంధించి సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఐఐటీ కౌన్సిల్ ఐఐటీ ఢిల్లీని ఆదేశించింది. తెలుగుతోపాటు ప్రస్తుతం నీట్, జేఈఈ మెయిన్‌ను నిర్వహిస్తున్నట్టుగా 11 ప్రాంతీయ భాషల్లో జేఈఈ అడ్వాన్స్‌డ్ నిర్వహణపై సాధ్యాసాధ్యాలపై 5 నెలల్లో నివేదిక ఇవ్వాలని ఐఐటీ కౌన్సిల్ ఆదేశించింది. ప్రధానంగా ఐఐటీల్లో డ్రాపౌట్ల నివారణకు తీసుకోవల్సిన చర్యలపై ఐఐటీ కౌన్సిల్ దృష్టి పెట్టింది. డ్రాపౌట్స్ నివారణకు తీసుకోవల్సిన చర్యలపై అధ్యయనం చేసి నివేదికను

03

## కొత్త తరహాలో దేశానికి వచ్చిన రుతుపవనాలు

**విశాఖపట్టణం:**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన కారణంగా రుతుపవనాలు దేశంలోని వివిధ ప్రాంతాలకు వేగంగా చేరుకున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ ఏడాది రుతుపవనాలు ఇప్పటి వరకు దేశంలోని 80 శాతానికి పైగా ప్రాంతాలను చేరుకున్నాయని భారత వాతవరణ శాఖ సీనియన్ శాస్త్రవేత్త డాక్టర్ నరేష్ కుమార్ వెల్లడించారు. రుతు పవనాలు ఆదివారం ఒకే రోజు ఢిల్లీ, ముంబైకి చేరుకున్నాయి. 62 ఏళ్ల తర్వాత ఇలా జరుగుతోందని డాక్టర్



03

## 100కు చేరిన టమోటా

**ప్రజా తపన ,న్యూఢిల్లీ:**



ఈసారి నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా రావడం మార్కెట్ లో తీవ్ర ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా టమాటా ధరలు కొండెక్కి కూర్చున్నాయి. సాధారణంగా చాలా కూరల్లో టమాటాను వినియోగిస్తున్నారు. నిన్న మొన్నటివరకు ఎండల కారణంగా టమాటా దిగుబడి తక్కువగా ఉంది. జూన్ మొదటి వారంలో రూ.15 నుంచి రూ.20గా ఉన్న టామాటా ధరలు ప్రస్తుతం రూ.60కి చేరుకుంది. కొన్ని చోట్ల టమాటా కేజీ ధర రూ.80కి చేరి వంటింట్లో మరింత మంట పెడుతోంది. కోలార్ లోని హోల్‌సేల్ మార్కెట్‌లో 15 కిలోల టమాటా రూ.

03

## సైన్యాన్ని అడ్డుకుంటున్న స్థానిక మహిళలు


**ఇంఫాల్ :**

దాదాపు రెండు నెలల నుంచి హింసాత్మక సంఘటనలతో అట్టుడికిపోతున్న మణిపూర్ రాష్ట్రాన్ని చక్కదిద్దేందుకు వచ్చిన సైన్యాన్ని స్థానిక మహిళలు అడ్డుకుంటున్నారు. సైనిక వాహనాలు నడవకుండా పెద్ద ఎత్తున రోడ్లపైకి చేరుతున్నారు. కొన్ని చోట్ల రోడ్లను తవ్వేస్తున్నారు. వీరి రక్షణతో హింసాత్మక నిరసనకారులు తప్పించుకుంటున్నారు. దీంతో రాష్ట్రంలో శాంతిభద్రతల పునరుద్ధరణకు తమకు సహకరించాలని సైన్యం ట్విటర్ వేదికగా ప్రజలందరినీ కోరింది.మణిపూర్ రాష్ట్రంలో మే నెల నుంచి ఉద్రిక్త పరిస్థితులు



03

# శూన్యం నుండి కవిత్వం వైపు




**1.మీ రచనలకు ప్రేరణ కలిగించే విషయాలను మాతో పంచుకోండి.**

బాల్యంలో లాంతరు వెలుగులో నాన్న చదివి వినిపించిన జానపద కథలు,పురాణ గాథలు,నవలలు నాలో అక్షరాలను విత్తాయి. ఉత్తరాంధ్ర బతుకు విధ్వంసం దారిచూపింది. అమ్మ మిగిల్చిపోయిన ఖాళీ తక్షణం నన్ను అక్షరంగా మలిచింది. "గాజు రెక్కల తూనీగ", "నాలుగు రెక్కల పిట్ట" కవితా సంపుటాలుగా ఇప్పటికి రెండు ఆకులు తొడిగాను. పగళ్లు పిల్లలకు పాఠాలు చెబుతూ రాత్రులు కళ్ళల్లో దివిటీలు వెలిగించుకుని నన్ను నేను వాక్యాలుగా అనువదించుకుంటున్నాను. సమాజంలోని వ్యత్యాసాలు, మూకస్వామ్యాలు, బతుకు రొద,శూన్యం నన్ను కదిలిస్తాయి.

నాదైన వాక్యాన్నీ, నాదైన గొంతునీ, నాదైన భాషనీ వదిలివెళ్లాలనేది నా స్వప్నం.

**2.కేవలం కవిత్వం మాత్రమే రాయడానికి ఎందుకు పరిమితం అయ్యారు.**

కవిత్వం నా తక్షణ ప్రతిస్పందన. నా దేహానికి మొలిచిన అదనపు చెయ్యి. కొన్ని సంఘటనలు నన్ను ముక్కలు చేస్తాయి. నన్ను నేను అతికించుకోవడానికి కవిత్వాన్ని ఆశ్రయిస్తాను. కొన్ని విపరీత ధోరణులు, ప్రభుత్వాల తెంపరితనం, రాజ్యహింస,అభివృద్ధి విధ్వంసం,ప్రజల అనేకానేక నిస్సహాయతలు నన్ను కలవరపెడతాయి. అక్షరం మీద వ్యక్తీకరణ మీద ఉన్న పరిమితులు నిర్ఘాంతపరుస్తాయి. అప్పటికప్పుడు ఏదో ఒకటి మాట్లాడకపోతే,ఉక్కిరిబిక్కిరి అవుతున్నానని చెప్పకపోతే... బతుకుతున్నట్టు అనిపించదు. కవిత్వం ప్రపంచంతో నేను సాగించే సంభాషణ.

**3.మీ కవిత్వాన్ని గురించి పాఠకుల నుంచి ఎలాంటి స్పందన వచ్చింది.**

నా తొలి సంపుటి "గాజు రెక్కల తూనీగ" లో మొదటి కవిత 'ఇంకొంచెం యుద్ధాన్ని ప్రేమించు'. ఒక స్నేహితురాలి జీవితం ఈ కవితకు ప్రేరణ. అప్పట్లో తెలంగాణలో ఇంటర్మీడియట్ పిల్లల ఆత్మహత్యల విషాదం ఒకటి కొనసాగుతుండేది. ఆ నేపథ్యంలో నుండి వచ్చిన ఈ కవిత, తన ఆత్మబంధువు పోయిన వేదన,నైరాశ్యం నుండి బయటపడేసిందని స్నేహితుడైన ఒక టీచర్ చెప్పడం మర్చిపోలేని అనుభవం. పత్రికలలో నా కవితలు చూసి, నేను ఎంతగానో అభిమానించే సాహితీవేత్తలు నన్ను పలకరించడం గొప్ప అనుభూతి. కరోనా రెండో చీకటి తరంగం విరుచుకుపడుతున్నపుడు రాసిన, 'రాలిన ఆకులు' చదివి బస్ కండక్టర్,బార్బర్,నాన్నను పోగొట్టుకున్న ఒక ముస్లిం కుర్రాడు... ఇలా సాహిత్యంతో పెద్దగా అనుబంధం లేనివాళ్లు నాతో సంభాషించడం నా అక్షరాలకు దక్కిన గౌరవం. రెండో సంపుటి "నాలుగు రెక్కల పిట్ట" లో టైటిల్ పోయెమ్ ను కరోనా అనంతర దుఃఖాన్ని దాటడానికి అక్షరాల వంతెన ఒకటి కావాలని అనుకున్నప్పుడు రాసింది. మరణ తాత్వికతను పలికించే 'అనుభవం'కవిత, నిజ జీవిత అనుభవాన్ని సార్వజనీనం చేసిన 'మొలకెత్తుతున్న ఇల్లు' కవిత, స్త్రీ గుండెతో రాసిన 'ఆ రోజుల్లో', వానై పుడతాను','ఈ ఒక్క గాయాన్ని నాకొదిలిపెట్టు' వంటి కవితలు, వర్తమాన రాజకీయాలను చిత్రిస్తూ రాసిన 'వంకరచెట్ల అడవి', 'ఒకే రంగు ఆకాశం','విధ్వంస గీతం' వంటి కవితలు,ఉద్దానం(శ్రీకాకుళంలో తీరప్రాంతం) కిడ్నీ వ్యాధుల వేదనను పలికించిన 'శోక తీరం','ఒంటరి దుఃఖాలు'... ఇలా కొన్ని కవితలు పాఠకుల ప్రేమను,ఆదరణను పొందాయి. పది పదిహేను వరకూ కవితలు అవార్డుల పట్టికలో పేరును చెక్కి నాలో కొత్త ఊపిరులను నింపాయి.

**4. మీ కవిత్వానికి రెక్కలు తొడిగారు ఎందుకని.**

ఎవరో ఒకరు, ఎపుడో ఒకప్పుడు ఈ ప్రశ్న వేస్తారని ఊహించాను. నగరజీవితాల్లో ఆవరించిన శూన్యం, మానవ సంబంధాలలో తడిలేనితనం(పల్లెలతో పోల్చినప్పుడు ఎక్కువ) గురించి నా వ్యక్తిగత అనుభవాలు,సంఘటనల నుండి వచ్చిన కవిత - గాజు'రెక్కల' తూనీగ. కవిగా నాకు గుర్తింపు నిచ్చింది. దాన్నే మొదటి పుస్తకం శీర్షికగా పెట్టుకున్నాను. ఇక్కడ గాజు రెక్కలు అనే పదాన్ని భళ్ళున పగిలిపోయే నగరం గాంభీర్యతకు ప్రతీకగా ఉపయోగించాను.

జీవితపు అత్యంత క్లిష్టమైన దశను దాటేందుకు నన్ను నేను సన్నద్ధం చేసుకోవడానికి రాసుకున్న కవిత - నాలుగు 'రెక్కల' పిట్ట. దీనినే నా రెండో సంపుటికి టైటిల్ గా తీసుకున్నాను. ఇక్కడ నాలుగు రెక్కల పిట్ట అనే పదబంధాన్ని హృదయానికి (గుండెలో నాలుగు గదులు ఉంటాయి) ప్రతీకగా ప్రయోగించాను. నిజానికి రెండూ వేర్వేరు నేపథ్యాలల్లో,వేర్వేరు సందర్భాల్లో రాసినవి. రెండిటిలో రెక్కలు ఉండడం యాదృచ్ఛికమే కావొచ్చు. రెక్కలు అనే పదం స్వేచ్ఛకు సంకేతం కావడం మాత్రం నిజం.

**5.ఉత్తరాంధ్ర కవిత్వం ద్వారా ప్రాంతీయ చైతన్యం ఎంతవరకూ కలిగింది అంటే మీరు ఏమంటారు.**

ఉత్తరాంధ్రను "ఉద్యమాంధ్ర" అంటాం. సాయుధ రైతాంగ పోరాటాన్ని కన్న నేలగా గొప్పదైన ప్రాంతీయ చైతన్యం ఉత్తరాంధ్ర సొంతం. సామాజిక వ్యత్యస్యాలకు,అణిచివేతకు వ్యతిరేకంగా ఉద్యమించిన మట్టిలోంచి పోరాట దృక్పథాన్ని,తెగింపును, ప్రశ్నించే తత్వాన్ని ప్రోది చేస్తూ వచ్చిన పాటలు,కవితలు, కథలు,నాటికలు,నాటకాలు స్థానికంగానే కాదు యావత్ తెలుగు నేలకే వెలుగు చూపాయి. జాతీయభావాన్ని రేకెత్తించాయి. ప్రజా పోరాటాలను ముందుండి నడిపించాయి. నడిపిస్తూనే వున్నాయి.

**6.మీ ప్రాంతంలో ఉండే సాంస్కృతిక నేపథ్యం ఎక్కడైనా మీ కవితల్లో దర్శనమిస్తాయా.**

నా అక్షరాల్లో మా ప్రాంతపు శ్రమ సంస్కృతి అంతర్లీనంగా దర్శనమిస్తూ వుంటుంది. 'వలస రైలుబండి' వంటి కొన్ని కవితలలో ఇక్కడి తప్పెటగుళ్ళ, జముకు పాటల ప్రతిఫలనాలు కనబడతాయి. మా ప్రాంతపు వెనుకుబాటుతనాన్ని చెప్పే క్రమంలో వలస దుఃఖాన్ని ప్రకటించేటప్పుడు సాంస్కృతిక నేపథ్యానిది ప్రధాన భూమిక.

**7.సాహిత్యం మీకు ఏమిచ్చింది**

ఆత్మవిమర్శ అనే రచ్చబండ ముందు నిలబెట్టే ప్రశ్న. ఇంటా బయటా నాకంటూ ఒక అదనపు గుర్తింపును ఇచ్చింది. తలపండిన వాక్యాల ప్రశంసలు దక్కేలా చేసింది. కొన్నైనా మంచి స్నేహాలను అందించింది. వెలుగేదో చీకటేదో తడిమి చూసుకునే చూపునిచ్చింది. నా బాధ్యతల నుండి నేను తప్పిపోకుండా హెచ్చరిస్తూనే వుంది. ముఖ్యంగా.. మరణం తర్వాత కూడా నేను బ్రతికుండే సజీవమార్గాన్ని తెరిచింది. కవిత్వం నాకు అమ్మ గర్భం. నేనిక్కడ మాత్రమే సురక్షితంగా, స్వేచ్ఛగా,నిర్భయంగా ఉంటాను.ఇంతకన్నా వేరే ఏం కావాలి.

**- సాంబమూర్తి లండ**

**పరిచయ కర్త :**

**డా.బి. నాగశేషు**

# ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయకేంద్రాన్ని సందర్శించిన ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ అధ్యక్షురాలు డా. నందమూరి లక్ష్మీపార్వతి

**ప్రజా తపన, నెల్లూరు**

ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ ప్రస్తుత చైర్‌పర్సన్ డా. నందమూరి లక్ష్మీపార్వతిగారు ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని మర్యాదపూర్వకంగా సందర్శించారు. ఆమె కేంద్రంలో జరుగుతున్న ఆయా ప్రాజెక్టుల వివరాల్ని కేంద్ర డైరెక్టర్ ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారిని అడిగి తెలుసుకున్నారు. కేంద్ర గ్రంథాలయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ...తెలుగు భాషను ప్రంచదేశాల పండితులు 'ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్' అని వేనోళ్ళపొగిడారు. మన భాషకున్నంత గుర్తింపు ఎంతో గొప్పది. దానిని మనమంతా కాపాడుకోవాల్సిన అవసరం నేడు ఆసన్నమైంది. సంస్కృతం, తెలుగు భాషలు పరస్పరం ఆధారితమైనవి. నేడు ఆంగ్ల భాష తెలుగు భాషను కనుమరుగైయ్యేల చేస్తుండటం విచారకరం. మాతృభాషా సంస్కృతీ, సంప్రదాయాల్ని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, తెలుగు అకాడమీ లాంటి సంస్థలు కాపాడాలి. ఈ రెండు సంస్థలు ఒకే భావసారూప్యత కలిగినవి కాబట్టి పరస్పర సహకారంతో పనిచేయాలని, చేస్తామని గుర్తుచేశారు. అంతేకాకుండా తెలుగు భాషా ఔన్నత్యాన్ని దశదిశలా వ్యాపింపజేయాలని నందమూరి లక్ష్మీపార్వతి గారు చెప్పారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్ర సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారు ఈ సంస్థ లక్ష్యాల్ని, ఉద్దేశ్యాల్ని లక్ష్మీపార్వతిగారికి తెలియజేశారు. తదనంతరం డా. ఎన్. లక్ష్మీపార్వతిగారిని ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారు పుష్పగుచ్ఛం, శాలూవాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర విద్యాత్మక, కార్యనిర్వహక సిబ్బంది పాల్గొన్నారు.



# పవన్ కళ్యాణ్ కు అనారోగ్యం

(మొదటిపేజీ తరువాయి)

పర్యటిస్తున్నారు.ఇక సినిమాల విషయానికొస్తే.. పవన్ ప్రస్తుతం నాలుగు సినిమాల్లో నటిస్తున్నారు. సముద్ర ఖని దర్శకత్వంలో పవన్ నటిస్తోన్న బ్రో జులై 28న విడుదల కానుంది. ఇందులో మెగా మేనల్లుడు సాయి ధరమ్ తేజ్ మరో హీరోగా నటిస్తున్నాడు. ఈరోజు విడుదలైన పవన్, సాయి తేజ్‌ల పోస్టర్‌కు విపరీతమైన రెస్పాన్స్ వచ్చింది. 'బ్రో' తో పాటు సుజిత్ దర్శకత్వంలో 'ఓజీ', హరీష్ శంకర్ దర్శకత్వంలో ఉస్తాద్ భగత్ సింగ్, క్రిష్ దర్శకత్వంలో హరిహరవీరమల్లు మూవీస్‌లో నటిస్తున్నారు పవన్.

# చంద్రబాబు 14 ఏళ్ల పాలనే ప్రజలందరికీ పెద్ద నరకం

**- ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి**

**తిరుపతి**



చంద్రబాబు 14 ఏళ్ళ పాలనే ప్రజలందరికీ పెద్ద నరమకని గ్రహించిన ప్రజలే ఆయనను తరిమికొట్టారని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి అన్నారు. జగనన్న పాలనలో ప్రజల సంతోషాన్ని చూసి ఓర్వలేకే నాలుగేళ్ల నరకం అంటూ నేడు కొత్తగా ప్రచారం సాగిస్తున్నాడని ఎద్దెవ చేసారు. తిరుపతి నగర పాలక సంస్థ 22 వ డివిజన్లో మంగళవారం ఉదయం తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ పర్యటిస్తూ జగనన్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ జగనన్న పాలనలో పేద ప్రజలంతా సంతృప్తికర జీవితాన్ని గడుపుతున్నారని, దాన్ని చూసి ఓర్వలేక చంద్రబాబు నాయుడు, ఆయనకు ఒత్తాసు పలికే పవన్ కల్యాణ్ వారిష్టమొచ్చినట్టు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పై బూతుల పంచాగాన్ని ఎత్తుకుని విషాన్ని వెళ్లగక్కుతున్నారని భూమన దుయ్యబట్టారు. చంద్రబాబు కొత్తగా నాలుగేళ్ల నరకం అనే కొత్త ప్రచార కార్యక్రమాన్ని తీసుకొచ్చుడాని ఆక్షేపిస్తూ, చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో ప్రజలు నరకాన్ని చవిచూశారు కాబట్టే నరకాసురుని వధించి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డికి పట్టం కట్టారన్నారు. చంద్రబాబుకు, ఆయన్ను మోసే పెత్తందార్లకు, ఆయనకు అండగా నిలుస్తున్న ప్రతిఘాతక శక్తులకు నిజంగా జగనన్న పాలన నరకమే అని వ్యంగాస్త్రాన్ని సంధించారు. పేద ప్రజలకు మేలు చేయాలన్న జగనన్న సంకల్పం ఖచ్చితంగా పెత్తందార్లకు నరకంగా ఉంటుందన్నారు. తాను పెత్తందార్లవైపేనని, పేదలకు వ్యతిరేకమని చంద్రబాబు మరొకసారి ప్రకటించుకున్నారని భూమన స్పష్టం చేసారు. చంద్రబాబు ఎన్ని వేషాలు వేసినా, తల్లకిందులుగా తపస్సు చేసినా, ప్రజా మద్దతున్న జగన్ మోహన్ రెడ్డిని ఓడించలేరని భూమన ధీమా వ్యక్తం చేసారు. గతంలో కురిసిన వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ద తీసుకుని ఈ ప్రాంతంలో పర్యటించి, యుద్ద ప్రాతిపదికన రోడ్లను పూర్తి చేయాలని ఆదేశించారని భూమన కరుణాకర రెడ్డి తెలిపారు. అందులో భాగంగా ఈ డివిజన్లో రోడ్లన్నింటినీ అత్యంత సుందరంగా నిర్మించడంతో స్థానికులు ఆనందంగా వున్నారని, దీంతో జగనన్న పాలన పట్ల ప్రజలంతా సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని, అభివృద్ధి జరగాలంటే మళ్లీ జగనన్న అధికారంలో కొనసాగాలని ప్రజలు భావిస్తున్నారని భూమన కరుణాకర రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 22వ డివిజన్ కార్పొరేటర్ పైడి సునీత, డిష్ చంద్ర, కార్పొరేటర్లు మునిరామిరెడ్డి, ఆరణి సంధ్య, సి.కె.రేవతి, తిరుత్తణి శైలజ, వైసిపి నాయకులు వెంకటమునిరెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, పడమటి కుమార్, తిమ్మారెడ్డి, మబ్బు నాధమునిరెడ్డి, అనీల్, కిరణ్, మనోహర్ రెడ్డి, దేవధానం, శ్యామల, జ్యోతి ప్రకాష్, తాళ్ళూరి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# కామన్ సివిల్ కోడ్ కు సిక్కులు అంగీకరిస్తారా

**హైదరాబాద్ :**

యూనిఫాం సివిల్ కోడ్ అంశాన్ని ప్రధాని మోదీ భోపాల్ లో ప్రత్యేకంగా ప్రస్తావించిన అంశంపై మజ్లిస్ చీఫ్ , హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఘాటుగా స్పందించారు. పంజాబ్ వెళ్లి సిక్కులకు యూనిఫాం సివిల్ కోడ్ గురించి చెప్పాలని సవాల్ చేశారు. ఆ తర్వాత అక్కడ పరిస్థితులు ఎలా ఉంటాయో చూడాలన్నారు. జాతీయ సమైక్యత , భిన్నత్వం గురించి ప్రధాని మోదీ మాట్లాడుతున్నారని.. ఉమ్మడి పౌరస్మతి పేరుతో వాటికి విఘాతం కల్పించాలని ప్రధాని మోదీ అనుకుంటున్నారా అని ప్రశ్నించారు. యూనిఫాం సివిల్ కోడ్ ద్వారా హిందూ అన్ డివైడెడ్ ఫ్యామిలీ చట్టాన్ని రద్దు చేస్తారా అని సవాల్ చేశారు. త్రిపుల్ తలాక్ కోసం వాదించే వారు.. ముస్లిం ఓటు బ్యాంకు కోసం తాపత్రయ పడుతున్నారని, వారంతా ముస్లిం కుమార్తెలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ప్రధాని విమర్శించారు. త్రిపుల్ తలాక్ కేవలం మహిళలకు సంబంధించినది మాత్రమే కాదని, మొత్తం కుటుంబాన్ని కూడా నాశనం చేస్తుందని అన్నారు.



ఎంతో ఆశతో కుటుంబ సభ్యులు ఎవరితోనైనా పెళ్లి చేసుకున్న మహిళను త్రిపుల్ తలాక్ చెప్పి వెనక్కి పంపిస్తే ఆ తల్లిదండ్రులు, సోదరులు ఎంత ఒత్తిడికి, ఆందోళనకు గురవుతారో, ఎంత బాధ అనుభవిస్తారో మాటల్లో చెప్పలేమన్నారు. ముస్లిం కుమార్తెలను అణచి వేయడానికి స్వేచ్ఛ ఉండేలా కొందరు త్రిపుల్ తలాక్ అనే కత్తిని వేడాలదీయాలని అనుకుంటున్నారని ప్రధాని విమర్శించారు. అందుకే ముస్లిం సోదరీమణులు, కూతుళ్లు ఎప్పుడూ బీజేపీ వెంట, మోదీ వెంటే ఉంటారని పేర్కొన్నారు. పస్మండ ముస్లింలు రాజకీయాలకు బలి అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కొందరు బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని, బీజేపీ శ్రేణులు వెళ్లి ముస్లింలకు ఈ విషయాన్ని వివరించి వారికి అవగాహన కల్పించాలని సూచించారు. తద్వారా వారు అలాంటి వారి బారిన పడకుండా ఉంటారని అన్నారు. బీజేపీ అంతా అభివృద్ధి రాజకీయాలే తప్పా.. బుజ్జగింపు రాజకీయాలు చేయదని మోదీ చెప్పారు. రాష్ట్రంలో దళితులు, మహాదళితులు మధ్య చిచ్చు పెట్టి కుల రాజకీయం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రతిపక్షాలు ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నాయని, 2024 లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ భారీ విజయం సాధించడం ఖాయమని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. 2024లో బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలు నిర్ణయించుకున్నారని విపక్ష పార్టీలు ఆందోళన చెందుతుండటం స్పష్టంగా కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. మరోసారి బీజేపీ ప్రభుత్వం వచ్చి తీరుతుందని అందుకే ప్రతిపక్షాలు ఆందోళన చెందుతున్నట్లు విమర్శించారు.

# మోడీ నోట... యూనిఫాం సివిల్ కోడ్ మాట

(మొదటిపేజీ తరువాయి)

చేశారనుకోండి. వారు హిందూవైనా, ముస్లిం ఐనా, ఇంకా ఏ మతానికి చెందిన వారైనా అందరికి ఒకే రకమైన శిక్షలు విధిస్తారు. క్రిమినల్ లా ముందు... అందరూ సమానమే. రెండవది సివిల్ లా..! అంటే ఇందులో వ్యక్తులకు సంబంధించిన పెళ్లి, విడాకులు, వారసత్వ హక్కులు, దత్తత తదితర అంశాలు ఉంటాయి. వీటిని ఒక్కో మతం వారు ఒక్కోలా పాటిస్తున్నారు ప్రస్తుతానికి. కానీ సివిల్ లా కూడా అందరికీ ఒకేలా ఉండాలని చెప్పేదే యూనిఫామ్ సివిల్ కోడ్ బాగానే ఉందిగా.. మరి ప్రాబ్లం ఎక్కడొస్తుంది అంటారా.. మనది సెక్యూలర్ దేశం. విభిన్నమతాలకు, తెగలకు చెందిన వారు ఉంటారు. ఉదాహరణకు హిందూ ఆచారాల ప్రకారం.. ఒక్కరినే పెళ్లి చేసుకోవాలి. విడాకుల ప్రక్రియ కఠినంగా ఉంటుంది. ఒకవేళ ఇచ్చిన.. భరణం తప్పకుండా ఇవ్వాలి. అలాగే, వారతస్వ హక్కులు ఒకేలా ఉంటాయి. అదే ఇస్లాం ఆచారాల ప్రకారం..పెళ్లి, విడాకుల నియమనిబంధనలు వేరే. ఇదివరకూ ట్రిపుల్ తలాఖ్ ఉండేది. అంటే భార్యతో ఎప్పుడైనా భర్తకు విసుగొస్తే మూడుసార్లు నోటితో, పేపర్ మీదో తలాఖ్ తలాఖ్ తలాఖ్ అని చెప్పి వెళ్లిపోవచ్చు. చట్ట ప్రకారం అది చెల్లేది కూడా. బీజేపీ ప్రభుత్వం వచ్చాక ట్రిపుల్ తలాఖ్ ను రద్దు చేసింది. విడాకులు పొందిన భార్యకు భరణం అందడం కూడా కష్టం. ముస్లింలు అనే కాదు వేర్వేరు మతాలకు ఇలా ప్రత్యేక చట్టాలున్నాయి. ఎన్నో శాతాబ్దాలుగా ఇలా ఆచారాలు పాటిస్తున్న వారంతా యూనిఫామ్ సివిల్ కోడ్ కిందకి తీసుకురావాలంటే అధికారంలో ఉన్న ప్రభుత్వానికి కత్తి మీద సామే. సెక్యూలర్ దేశంలో.. ఇది ఏ మాత్రం సాధ్యం కాదని ఓఎఓ అధినేత అసదుద్దీన్ ఓవైసీ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ అధికారంలోకి రాకముందు నుంచి వారి అజెండాలో 3 ప్రధాన అంశాలు ఉన్నాయి. 1. రామజన్మభూమి 2. ఆర్టికల్ -370 రద్దు 3. యూనిఫామ్ సివిల్ కోడ్. మోదీ సర్కార్ రెండోసారి అధికారంలోకి వచ్చాక.. రామజన్మభూమి, ఆర్టికల్ 370 రద్దు సమస్యలకు పరిష్కారం లభించింది. ఐతే.. 2024 ఎన్నికల ముందు వాళ్ల మూడో ప్రధాన అంశం పైకి తెరమీదకు తెస్తున్నారు. అందుకే..ప్రధాని ఈ రోజు చేసిన ప్రసంగం కూడా. ఇప్పటికే యూనిఫామ్ సివిల్ కోడ్ పై వేర్వేరు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కమిటీలు కూడా వేశారు. ఆర్టికల్-44 ప్రకారం యూనిఫామ్ సివిల్ కోడ్ ను తీసుకురావాలనే బీజేపీ ప్రయత్నాలు ఫలిస్తాయా..లేదా ఇది ప్రతిపక్షాలకో, బీజేపీకో కేవలం రాజకీయ అస్త్రంగా మారుతుందా తెలియాలంటే మరికొంత వేచి చూడాలి.

### కవిత పేరెత్తి మరీ..బీఆర్ఎస్‌పై స్వరం మార్చిన ప్రధాని మోదీ

కేంద్రంలోని అధికార బీజేపీ తెలంగాణలో అధికార పార్టీ బీఆర్ఎస్ మధ్య రాజీ కుదిరిందని, ఈ రెండు పార్టీలది ఫెవికాల్ బంధమని, ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అవ్వకపోవడమే ఇందుకు నిదర్శనమంటూ విస్తృతంగా ప్రచారం జరుగుతున్న వేళ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ టార్గెట్‌గా ప్రధాని నరేంద్ర మోదీ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ బిడ్డ గెలవాలంటే బీఆర్ఎస్‌కు ఓటు వేయండి అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశ ప్రజలు గెలవాలంటే బీజేపీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ వేదికగా జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ ఈ మేరకు హాట్ కామెంట్స్ చేశారు. సాధారణంగా ప్రధాని మోదీ పేరు ఎత్తకుండా పరోక్షంగా విమర్శిస్తుంటారు. కానీ ఈసారి మాత్రం ఏకంగా సీఎం కేసీఆర్, ఎంఎల్సీ కవిత పేర్లు ప్రస్తావించి మరీ ఎటాక్ చేశారు. మొత్తంగా తెలంగాణలో కేసీఆర్ సర్కారును గద్దె దించాలని అర్థం వచ్చేలా స్పష్టమైన వైఖరిని కనపరచడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. మొదటిసారి కేసీఆర్‌పై మోదీ ప్రత్యక్షంగా విమర్శలు గుప్పించారని చర్చించుకుంటున్నారు. కాగా మధ్యప్రదేశ్ అసెంబ్లీకి త్వరలోనే ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు అన్ని రాజకీయ పార్టీలు ప్రచార కార్యక్రమాలను మొదలుపెట్టారు. ఇందులో భాగంగా బీజేపీ పలు కార్యక్రమాలను నిర్వహించింది. మంగళవారం నిర్వహించిన పలు ఈవెంట్స్‌లో ప్రధాని మోదీ సహా పలువురు కీలక నేతలు పాల్గొన్నారు.

# ఇక తెలుగులో జేఈఈ

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వాలని ఐఐటీ ఖరగ్‌పూర్‌ను కౌన్సిల్ ఆదేశించింది. గత ఏప్రిల్‌లో జరిగిన ఐఐటీ కౌన్సిల్ మీటింగ్‌కు సంబంధించిన తీర్మానాలను కేంద్ర విద్యాశాఖ వెల్లడించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఐఐటీ కౌన్సిల్ సమావేశం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో తీసుకున్న తీర్మానాలను కేంద్ర విద్యా శాఖ వెల్లడించింది. నీట్, జేఈఈ మెయిన్, నీట్ పరీక్షల మాదిరిగానే జేఈఈ అడ్వాన్స్ డ్ పరీక్షను తెలుగుతోపాటు 11 ప్రాంతీయ భాషల్లో నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకోసం వచ్చే 3,4 నెలల్లో మేధోమథన సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులతో సహా చర్చించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరింది. ఏఇఇ అడ్వాన్స్ డ్‌ను ప్రస్తుతం ఇంగ్లీష్ మరియు హిందీ రెండు భాషలలో మాత్రమే నిర్వహించబడుతున్న విషయం తెలిసిందే. అన్ని ఉన్నత విద్యా సంస్థల కోసం ఒకే ప్రవేశ పరీక్షను దృష్టిలో ఉంచుకుని దేశంలో నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షల సంఖ్యను తగ్గించడంపై చర్చించారు. ప్రవేశ పరీక్షల సంఖ్యను తగ్గించడం మాత్రమే కాకుండా విద్యార్థులపై భారం పడుతుందని.. కోచింగ్ అవసరాలు కూడా తగ్గుతాయని కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశారు. 2024-25 విద్యా సంవత్సరం నుంచి అమలు జరిగే అవకాశం ఉంది. దీంతో పాటు ఐఐటీలు, ఎన్ఐటీలు మినహా దేశవ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలకు జాతీయస్థాయిలో ఒకే పరీక్ష నిర్వహణకు సంబంధించిన సాధ్యాసాధ్యాలపై నివేదికను 5 నెలల్లో ఇవ్వాలని ఈ బాధ్యతను ఐఐటీ ఢిల్లీకి అప్పగిస్తూ ఐఐటీ కౌన్సిల్ తీర్మానం చేసింది. అదేవిధంగా ఐఐటీలకు ఒక విజన్ ఉండాలని అలా రాబోయే 25 సంవత్సరాలకు సంబంధించిన విజన్ డాక్యుమెంట్‌ను ప్రతి ఐఐటీ రూపొందించుకోవాలని.. ఇందుకోసం అంతర్జాతీయ నిపుణులతో కలిసి కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ఐఐటీ స్వల్పకాల విజన్ డాక్యుమెంట్‌ను సైతం సిద్ధం చేసుకోవాలని ఐఐటీ కౌన్సిల్ తీర్మానం చేసింది. పరిశ్రమల అవసరాల మేరకు ఎంటెక్ కోర్సులను రూపొందించాలని ఐఐటీ కౌన్సిల్ తీర్మానం చేసింది. ఇందుకు సంబంధించిన నివేదికను ఐఐటీ హైదరాబాద్ సమర్పించనుంది. ఐఐటీల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మెరిట్ కమ్ మీన్స్(ఎంసీఎం) స్కాలర్‌షిప్, పాకెట్ అలవెన్స్ ను పెంచాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. దీనిపై ఐఐటీ ఖరగ్‌పూర్ నివేదికను సమర్పించనుంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఐఐటీల్లో క్రీడా కోటా రిజర్వేషన్ అమలు కోసం విధివిధానాల రూపకల్పన బాధ్యతను ఐఐటీ మద్రాస్‌కు అప్పగించింది. ఆర్ట్స్, ఇతర కోర్సుల్లో మల్టీ డిసిప్లినరీ విధానాన్ని ప్రారంభించనున్నారు. ఆయా కోర్సుల్లో ఆర్ట్స్, సైన్స్, ఇంజనీరింగ్ సబ్జెక్టులు మిళితమై ఉంటాయి. ప్రధానమంత్రి రీసెర్చ్ ఫెలోషిప్(పీఎంఆర్ఎఫ్) రెండో విడతను అయిదేళ్లపాటు కొనసాగించాలని నిర్ణయించారు. ఏడాదికి 1000 మంది చొప్పున మొత్తం 5 సంవత్సరాల్లో 5000 మంది పీహెచ్‌డీ విద్యార్థులకు ఈ ఫెలోషిప్ అందజేస్తారు. వచ్చే విద్యా సంవత్సరం 2024-25 విద్యా సంవత్సరం నుంచి ఖరగ్‌పూర్, మద్రాస్, గువాహటి, భువనేశ్వర్ ఐఐటీల్లో నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సులను ప్రారంభిస్తారు.

# కొత్త ఉదయం దిశగా.. క్రాంతి మార్గంలో దేశం నడవాలి

(మొదటిపేజీ తరువాయి)

నడుస్తోందన్నారు. పండరీ దర్శనం కోసం వస్తే.. దర్శనం చేసుకోండి.. కానీ రాజకీయం చేయకండి అన్నారని కొందరు నేతలు అన్నట్లు సీఎం తెలిపారు. పండరీ పుణ్య స్థలం అని.. అక్కడ ఏమీ చెప్పలేదు.. కానీ ఇక్కడ అనకుండా ఉండలేనన్నారు. మహా నేతలు ఎందుకు ఆక్రోశానికి లోనవుతున్నారని ఆయన ప్రశ్నించారు. మేం ఎవరి టీమ్ కాదు.. కిసాన్ టీమ్ మాది.. అల్పసంఖ్యాకుల టీమ్ అని సీఎం కేసీఆర్ అన్నారు. అబ్ కీ బార్ కిసాన్ సర్కార్.. భాల్కే అన్నారని గుర్తు చేశారు. తెలంగాణ, మహారాష్ట్ర కోసం ఏర్పడిన పార్టీ తమది కాదన్నారు. దేశంలో ఉన్న సమస్యలన్నింటికీ.. పరివర్త భారత్ కావాలన్నారు. కోట్లాది ఎకరాల సాగు భూమికి నీరును అందిస్తామన్నారు. ఔరంగబాద్‌లో 8 రోజులకు ఒకసారి నీళ్లు వస్తాయన్నారు. సోలాపూర్‌లో 5 రోజులకు ఒకసారి వస్తాయన్నారు. అకోలాలో కూడా నీళ్లు రావడం లేదన్నారు. కేంద్ర జలవిధానాన్ని బంగాళాఖాతంలో వేయాలన్నారు. జలనీతిని మార్చేస్తామన్నారు. నయా భారత్‌ను రూపొందిస్తామన్నారు. దేశంలో నీళ్లు లేవంటే అది మరో మాట అవుతుందని, కానీ నేతల మాయమాటలు చెప్పి నీళ్లు ఇవ్వలేకపోయినట్లు ఆరోపించారు. బొగ్గు విద్యుత్తు, సోలార్ పవర్, హైడ్రో పవర్, థర్మల్ పవర్ మాత్రం దేశంలో ఎటువంటి సమస్య లేదన్నారు. ఆ బొగ్గు రిజర్వులు బిలియన్ల టన్నుల్లో ఉన్నట్లు సీఎం కేసీఆర్ తెలిపారు. కావాల్సినంత బొగ్గు నిల్వలు ఉన్నప్పుడు.. విద్యుత్తు సమస్య ఎందుకు వస్తోందని ప్రశ్నించారు. హైడ్రో, సోలార్, బొగ్గును సమతుల్యం చేస్తే, అప్పుడు దేశవ్యాప్తంగా విద్యుత్తు సమస్య ఉండదన్నారు. 125 ఏళ్లకు కావాల్సినంత బొగ్గు మన దగ్గర ఉందన్నారు. రైతుల కోసం 24 గంటల పాటు ఉచిత విద్యుత్తును తెలంగాణ ప్రభుత్వం అందిస్తోందని సీఎం కేసీఆర్ తెలిపారు. రైతులు ఒక్కటి కాకుంటే, మార్పు ఉండదన్నారు. రైతులు బ్రతికి ఉంటే ఎవరు జీవిస్తారు.. రైతులు మరణిస్తే ఎవరు బ్రతుకు తారని ఆయన అన్నారు. దివ్యాంగులకు తెలంగాణ ప్రభుత్వం పెన్షన్ 4వేలు ఇస్తోందన్నారు. మహారాష్ట్రలో బీఆర్ఎస్ సర్కార్ వస్తే.. అన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామన్నారు. వృద్ధులకు పెన్షన్ ఇస్తామన్నారు. అమెరికాలో నల్లజాతి వారిని ఎంతో వేధించారని, కానీ బరాక్ ఒబామాను గెలిపించి అక్కడి ప్రజలు ఆ రుణం తీర్చుకున్నట్లు కేసీఆర్ తెలిపారు. భారత్‌లో కూడా ఇలాంటి మార్పు రావాలని, రైతు ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. తెలంగాణలో ధరణి పోర్టల్‌తో భూముల్ని డిజిటలైజ్ చేసినట్లు సీఎం తెలిపారు. తెలంగాణలో జరుగుతున్న పథకాల అమలు .. మహారాష్ట్రలో ఎందుకు జరగవని ఆయన నిలదీశారు. బీఆర్ఎస్‌లో చేరిన మరాఠీ నేత భగీరథ్ బాల్కేకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు కేసీఆర్ తెలిపారు. పశ్చిమ మహారాష్ట్ర దర్వాజ్ ఓపెన్ చేసిన బాల్కేకు అండగా ఉంటామన్నారు. పండరీపుర వికాసం మొత్తం బాల్కే చేతుల మీదుగా జరుగుతుందన్నారు. రైతు ఇంట్లో పుట్టాను, నేను స్వయంగా రైతును, రైతు సంక్షేమం కోసం పనిచేస్తానని సీఎం కేసీఆర్ తెలిపారు. డిజిటల్ ఇండియా అని కేంద్రం చెబుతోందని, కానీ ఎందుకు భూముల్ని డిజిటైజ్ చేయడం లేదన్నారు. మేక్ ఇన్ ఇండియా అని ప్రధాని చెబుతారని, కానీ ప్రతి వీధిలో చైనా బజార్ ఎందుకు కనిపిస్తున్నట్లు ఆయన ప్రశ్నించారు. దీపావళి బాంబులు, రంగులన్నీ చైనా నుంచే ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. భారతదేశ పరివర్తనే అన్నింటికీ పరిష్కారం అన్నారు. ధరణి పోర్టల్లో ఒకసారి రైతు డేటా ఎక్కితే, దాన్ని ఎవరూ మార్చలేరన్నారు. ఒక్క రైతు బయోట్రిక్ ద్వారానే దాన్ని మార్చే వీలు ఉందన్నారు. తెలంగాణ రైతుల వద్ద పాస్‌పోర్టు లాంటి సుందరమైన పాస్ బుక్ ఉంటుందని అన్నారు. తాము ఎవరికీ టీం కాదు అని.. తమది రైతుల టీమ్, దళిత టీమ్ అన్నారు. రైతులు తోడుంటే ఎవరి అవసరం లేదన్నారు. అబ్ కీ బార్ .. కిసాన్ సర్కార్ అని సీఎం కేసీఆర్ నినాదాలు చేశారు. తమ విధానంలో న్యాయం, నీతి ఉందన్నారు. మరాఠీ నేత భగీరథ్ బాల్కే ఇవాళ సర్కోలీలో జరిగిన సభలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

# 100కు చేరిన టమోటా

1,100 ధర పలికింది. హోల్ సేల్ ధర ఇంతలా ఉందంటే.. కేజీ చిల్లర ధర రూ.80కి చేరుకుంది. రిటైల్ మార్కెట్‌లో కొన్ని చోట్ల నాణ్యత లేని టమాటాను సైతం ఇదే ధరలకు విక్రయిస్తున్నారు. ఈ బిజినెస్ కు సంబంధం ఉన్న ఓ సీనియర్ అధికారి మాట్లాడుతూ.. త్వరలోనే 1 కేజీ టమాటా ధర రూ.100 మార్కు దాటుతుందని అంచనా వేశారు. డిమాండ్ కు తగ్గట్లుగా సరఫరా లేకపోవడంతో కూరగాయల మార్కెట్ లో టమాటా ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. మరోవైపు రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో మొన్నటివరకు వేడితో ప్రతికూల వాతావరణంలో ఉత్పత్తి తగ్గినట్లుగా తెలుస్తోంది. టమాటాలతో పాటు ఇతర కూరగాయల ధరలు సైతం సాధారణం కన్నా ఎక్కువగా ఉన్నాయి. ఉల్లిపాయలు, బంగాళదుంపలు మాత్రం సాధారణ ధరకు విక్రయిస్తున్నారు. బీన్స్ ఒక కేజీ ధర రూ.120 నుంచి రూ.140 గా ఉంది, చిక్కుడు ధర రూ. 90 పలుకుతోంది. క్యాప్సికం సైతం రూ.80 కాగా, పచ్చి మిరపకాయల ధరలు సైతం భారీగా పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. గతేడాది బీన్స్ కు అధిక ధర రావడంతో ఈసారి కోలారులో రైతులు బీన్స్ సాగు చేశారు. మరోవైపు వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోవడంతో టమాటా లాంటి కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఓవైపు మహారాష్ట్రలో పంట నష్టం జరిగింది. మరోవైపు పశ్చిమ బెంగాల్, ఒడిశా, బంగ్లాదేశ్‌కు ఎగుమతి చేయడంతో టమాటా ధరలకు రెక్కలొచ్చాయి. ఈ ఏడాది సాధారణం కంటే 30 శాతం పంట దిగుబడి తక్కువగా ఉందని కోలార్ కు చెందిన రైతులు చెబుతున్నారు. గతేడాదితో పోల్చితే టమాటా ధరలు చాలా ఎక్కువ అని చెప్పవచ్చు. ఒకేసారి భారీగా టమాటా దిగుబడి రావడం, సాగు కూడా అధిక మొత్తంలో ఉండటంతో గతేడాది కేజీ టమాటా రూ.5కు పడిపోయింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మదనపల్లెలోని మార్కెట్ లో గత ఏడాది టమోటా ధరలు భారీగా పతనమయ్యాయి. మదనపల్లె మార్కెట్ నుంచి టమాటాలు దేశవ్యాప్తంగా ఎగుమతి అవుతుంటాయని తెలిసిందే. సాగు అధికం కావడం, దిగుబడి అదే స్థాయిలో రావడంతో గత ఏడాది టమాటా రైతులు కనీస ధర లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కేజీకి కేవలం రూ.5 మాత్రమే ధర రావడంతో రవాణా ఖర్చులు, పెట్టుబడి, కూలీ ఖర్చులు కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది.

# కొత్త తరహాలో దేశానికి వచ్చిన రుతుపవనాలు

(మొదటిపేజీ తరువాయి)

నరేష్ కుమార్ తెలిపారు. రుతుపవనాలు ముంబైకి సాధారణంగా జూన్ 11, అలాగే ఢిల్లీ జూన్ 27వ తేదీకి చేరుకుంటాయని తెలిపారు. అయితే దీనిని నేరుగా వాతావరణ మార్పులతో ముడి పెట్టలేమని ఆయన అన్నారు. దీనిని గుర్తించడానికి 30 నుంచి 40 సంవత్సరాల డేటా అవసరం అవుతుందని వాతావరణ శాస్త్రవేత్త చెప్పారు. ఈ సంవత్సరం రుతు పవనాలు కొత్త తరహాలో దేశానికి వచ్చాయని డాక్టర్ నరేష్ కుమార్ అన్నారు. 'సాధారణంగా, రుతుపవనాలు అల్పపీడన జోన్ ద్వారా సక్రియం చేయబడతాయి. అల్పపీడన జోన్ వల్ల ఏర్పడి అధిక వేగవంతమైన గాలులు రుతుపవనాలు వేగంగా దేశంలోని వివిధ ప్రాంతాలకు చేరుకునేలా చేస్తాయి. ఇది వర్షపాతాన్ని కలిగిస్తుంది' అని ఆయన చెప్పారు. పశ్చిమానికి చేరుకున్న రుతుపవనాలను అరేబియా సముద్ర నుంచి బలంగా వీచే గాలులు నెట్టివేస్తాయని వివరించారు. రుతు పవనాలు మహారాష్ట్ర మీద ఉన్నప్పుడు బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడటంతో మరింతగా పెరిగినట్లు ఆయన చెప్పారు. దీని ఫలితంగా ముంబై సహా మహారాష్ట్రలో వర్షాలు కురిశాయన్నారు. అదే సమయంలో అల్పపీడన జోన్ ప్రభావంతో ఢిల్లీతో సహా వాయువ్య భారత్ వైపు గాలులు వీచాయని, రెండు ప్రాంతాలను ఒకేసారి కవర్ చేశాయని వివరించారు. అస్సాంపై మేఘాలు కమ్ముకున్నాయని, అక్కడ మరికొన్ని రోజులు వర్షాలు కొనసాగుతాయని వివరించారు. రుద్ర ప్రయాగ్, ఉత్తరాఖండ్ లోని వివిధ ప్రాంతాల్లో 12



సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉందని డాక్టర్ నరేష్ కుమార్ తెలిపారు. గత రెండు రోజులుగా వర్షాలు కురిసిన తర్వాత దేశంలోని అనేక నగరాలు భారీ వర్షాలు, వరదల ప్రభావాన్ని చూస్తాయని చెప్పారు. పంజాబ్, హర్యానాలో ఇవాళ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నట్లు భారత వాతావరణ కేంద్రం అంచనా వేసింది. రానున్న రెండు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొందితెలంగాణలో రెండు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పలుచోట్ల తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని స్పష్టం చేసింది. హైదరాబాద్‌లో ఆకాశం సాధారణంగా మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. గరిష్ఠ ఉష్ణోగ్రత 31 డిగ్రీలుగా నమోదు కావచ్చు. కనిష్ఠ ఉష్ణోగ్రత 23 డిగ్రీలుగా ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఆదివారం గరిష్ణ ఉష్ణోగ్రత 30.8 డిగ్రీలు ఉంటే... కనిష్ఠ ఉష్ణోగ్రత 22.5 డిగ్రీలుగా ఉంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, భూపల్‌పల్లి, ములుగు, హన్మకొండ, వరంగల్, కొత్తగూడెం ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది.

# సైన్యాన్ని అడ్డుకుంటున్న స్థానిక మహిళలు

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగుతున్నాయి. గృహదహనాలు, వాహనాలను తగులబెట్టడం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. శాంతిభద్రతల పునరుద్ధరణ కోసం భారత సైన్యంలోని స్పియర్స్ కార్ప్స్ ఈ రాష్ట్రానికి వచ్చింది. కానీ స్థానికులు వీరికి సహకరించడం లేదు. ఉద్దేశపూర్వకంగానే అనేక రకాలుగా అడ్డంకులు సృష్టిస్తున్నారు. దీంతో స్పియర్స్ కార్ప్స్ మంగళవారం ఇచ్చిన ఓ ట్వీట్‌లో, విషమ పరిస్థితుల్లో ఉన్నవారి ప్రాణాలు, ఆస్తులను సకాలంలో కాపాడవలసి ఉంటుందని, ప్రజలు సమర్థనీయంకాని రీతిలో అడ్డంకులు సృష్టించడం వల్ల తాము సకాలంలో స్పందించడానికి విఘాతం కలుగుతుందని తెలిపింది. రెండు రోజుల క్రితం తూర్పు ఇంఫాల్‌లోని ఇథం అనే గ్రామంలో సైన్యం, మహిళా నిరసనకారుల మధ్య ప్రతిష్టంభన నెలకొన్న సంగతి తెలిసిందే. మహిళలు సైన్యాన్ని నిరోధించడం వల్ల 12 మంది తీవ్రవాదులు తప్పించుకుపోయారు. ఈ నేపథ్యంలో మణిపూర్‌లో శాంతిభద్రతల పునరుద్ధరణకు తమకు సహకరించాలని రాష్ట్ర ప్రజలను సైన్యం కోరింది. మణిపూర్‌లోని మహిళా యాక్టివిస్టులు ఉద్దేశపూర్వకంగానే సైన్యం ప్రయాణించే మార్గాల్లో అడ్డంకులు సృష్టిస్తున్నారని తెలిపింది. భద్రతా దళాల కార్యకలాపాలకు విఘాతం కలిగిస్తున్నారని తెలిపింది. ఇబ్బందుల్లో ఉన్నవారిని కాపాడటానికి, వారి ఆస్తులను రక్షించడానికి భద్రతా దళాలు సకాలంలో స్పందించవలసి ఉంటుందని, ఈ విధంగా అడ్డంకులు సృష్టించడం వల్ల భద్రతా దళాల కార్యకలాపాలకు విఘాతం కలుగుతుందని తెలిపింది. మణిపూర్ రాష్ట్రానికి సహాయపడటానికి తమకు సహాయపడాలని, శాంతిభద్రతల పునరుద్ధరణ కోసం తాము చేసే ప్రయత్నాలకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని భారత సైన్యం కోరుతోందని వివరించింది.

## తుల్జా భవానీ రెడ్డిపై కేసు నమోదు

**సిద్దిపేట**

జనగామ ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి కూతురు తుల్జా భవానీరెడ్డిపై కేసు నమోదు అయింది. రెండు రోజుల క్రితం మత్తడి ఆవరణ స్థలంలో 1270 గజాల స్థలం చుట్టు ఉన్న ఫెన్సింగ్ ను తుల్జాభవాని రెడ్డి కూల్చివేసిన విషయం తెలిసిందే. తన పేరుపై ఉన్న ఆ స్థలాన్ని మున్సిపాలిటికి అప్పగిస్తున్నట్లు తుల్జాభవాని చెప్పారు. పక్కనే ఉన్న తన భూమి ఫెన్సింగ్ ని కూడా తుల్జాభవాని కూల్చివేసిందని చేర్యాల పోలీసులకు బాధిత స్థల యజమాని రాజు భాయ్ ఫిర్యాదు చేసాడు. తుల్జాభావాని రెడ్డితో పాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డే ఈ కేసు పెట్టించారని ఆరోపణలు వెల్లువెత్తాయి.

## నోట్ల మార్పిడి మోసం..ఇద్దరు అరెస్టు

**పార్వతీపురం**

నోట్ల మార్పిడి చేస్తామని జిల్లా కేంద్రంలో 90 లక్షల నగదుతో పరారైన ఘనులు ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి కాకినాడ, భీమవరం చెందిన చక్రపాణి, నజీమ్ మరో ఇద్దరు తొంభై లక్షలకు ఐదు వందల నోట్లు ఇస్తే కోటి రూపాయల రెండు వేల రూపాయల నోట్లు ఇస్తామని ఎర వేసారు. ఆఫర్ కు ఆశపడ్డ రేగిడి ఆమదాలవలస చెందిన బాధితులు ఎ.అనిల్, వి.అనిల్ లు తొంభై లక్షల రూపాయలు తీసుకొచ్చి ఇచ్చారు. కోటి రూపాయలు రెండు వేల నోట్లు వేరే చోట ఉన్నాయని నమ్మించి తొంభై లక్షలతో నిందితులు పరార్ అయ్యారు. బాధితులు ఆశ పడి తమ స్నేహితుల వద్ద అప్పులు తెచ్చి తొంభై లక్షలకు ఐదు వందల నోట్లు ఏర్పాటు చేసారు. మోసపోయామని తెలిసి బాధితులు పోలీసులకు పిర్యాదు చేసారు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు ప్రారంభించారు. నలుగురిలో ఇద్దరు దొరికారు. మరో ఇద్దరు పరారీలో వున్నారు.

## మైనర్ విద్యార్థుల మధ్య తీవ్ర ఘర్షణ

**నాగర్ కర్నూలు**

నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునూతల మండల కేంద్రంలో హాస్టల్ విద్యార్థుల మధ్యన సోమవారం రాత్రి ఘర్షణ చోటుచేసుకుంది. పదవ తరగతి చదువుతున్న ఓ విద్యార్థీ ని కత్తితో పొడిచారు 9వ.తరగతి విద్యార్థులు... దింతో ఓ విద్యార్థి కి . స్వల్ప గాయాలు అయినవి. ఇందుకు ప్రేమ వ్యవహారమే అని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రాత్రి భోజనాలు అయినా తర్వాత ఇరువురు విద్యార్థులు ఆకస్మాతుగా గొడవకు దిగారు. చిలికి చిలికి గాలి వానగా అయినట్టు గొడవ పెద్దగా అయింది..ఒక 9వ తరగతి చదువుతున్న విద్యార్థి ఆకస్మాత్తుగా కత్తి ఒక్కసారిగా ప్రత్యర్థి పై దాడికి దిగాడు. ఒకరికి స్వల్ప గాయాలు కావడంతో భయంతో విద్యార్థులు బయటికిపరుగెత్తారు. హాస్టల్ సిబ్బంది చూసి గాయపడిన విద్యార్థిని నాగర్కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. రంగంలోకి దిగిన ఉప్పునంతల పోలీసులు ఇద్దరు విద్యార్థులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వారిద్దరూ మైనర్లు కావడంతో స్టేట్ హోం కు తరలించారు.

## పోలీస్ స్టేషన్ ఎదుట విషం తాగిన రైతు

**మదనపల్లె**

మహిళ వేధిస్తోందని పోలీస్ స్టేషన్ ఎదుట రైతు విషం తాగి ఆత్మహత్యాయత్నం చేసాడు. అన్నమయ్యజిల్లా మదనపల్లి నియోజకవర్గం రామసముద్రం మండలం పోలీస్ స్టేషన్ ఎదుట ఘటన జరిగింది. రామసముద్రంలో మండలంలోని కాప్పల్లికి చెందిన రైతు రాజప్ప (45)కు ఇవ్వవలసిన డబ్బు కళావతిని అడగడంతో ఆమె తప్పుడు ఫిర్యాదు చేసిందని రాజప్ప ఆరోపణ. తనను కళావతి వేధింపులకు గురిచేస్తోందని మనస్థాపం చెందాడు. ఆమెపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లి న రైతుకు పోలీసుల నుంచి చేదు అనుభవం ఎదురయిందని అంటున్నాడు. నీపైనే మహిళ కేసు పెట్టిందని పోలీసులు తెలపడంతో రాజప్ప అక్కడికక్కడే విషం తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన 108 వాహనం లో మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

## శాఖలో విద్యార్థుల అదృశ్యం

**విశాఖపట్నం**

విశాఖ జిల్లా గాజువాకలో ఇంటర్ చదువుతున్న ముగ్గురు విద్యార్థులు అదృశ్య మైన ఘటన ఆలస్యం గా వెలుగు చూసింది.ఈనెల 24 వ తేదిన కాలేజ్ కని ఇంటినుంచి బయ లుదేరి వెళ్లిన ముగ్గురు విద్యార్థులు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు.ఓ కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న పవన్, దిలీప్, బాబీ లు కే కోటపాడు వెళ్లి సమీప ప్రాంతాల్లో సంచరించినట్లు గా గుర్తించిన పోలీసులు అదృశ్యమైన ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు.

## కౌశిక్ రెడ్డిపై ముదిరాజ్ ల ఆగ్రహం

**హన్మకొండ**

ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్ రెడ్డి పై ముదిరాజ్ లు ఆగ్రహం వ్యక్తం చేసారు. హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ లో ముదిరాజ్ కులస్తులు ఆందోళనకు దిగారు. పాడి కౌశిక్ రెడ్డి దిష్టి బొమ్మకు శవయాత్ర నిర్వహించి దగ్ధం చేసారు. తెనుగు(ముదిరాజ్) కులస్తులను అగౌరవ పరిచేలా మాట్లాడిన పాడి కౌశిక్ రెడ్డి నీ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేసారు. కెమెరామెన్ ను కిడ్నాప్ చేసిన దాడి చేసిన కౌశిక్ రెడ్డి పై కిడ్నాప్, హత్య యత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేసారు. కౌశిక్ రెడ్డి పై చర్యలు తీసుకోకుంటే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనా చేస్తామని హెచ్చరించారు.

# కేంద్ర కేబినెట్ విస్తరణ అడుగులు..

**హైదరాబాద్ :**

తొమ్మిదేళ్ళ పరిపాలన పూర్తి చేసుకుని ఎన్నికల ఏడాదిలోకి అడుగు పెట్టింది నరేంద్ర మోదీ ప్రభుత్వం. మరో 9, 10 నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగబోతున్నాయి. మరోసారి నరేంద్ర మోదీ చరిష్మాను నమ్ముకునే భారతీయ జనతా పార్టీ ఎన్నికలకు సిద్ధమవుతోంది. అయితే, ఈసారి ఆయన చరిష్మానే బీజేపీని గట్టెక్కిస్తుందా అంటే గతంలో వున్నంత ధీమా కనిపించడం లేదు చాలామందిలో. బీజేపీ అభిమానులు సైతం మూడోసారి పార్టీ విజయంపై పూర్తిస్థాయి ధీమాలో లేరు. దానికి కారణం 2019నాటి బీజేపీకి 2023 నాటి బీజేపీకి తేడా కనిపిస్తోంది. ఆనాడు దేశంలో దాదాపు 75 శాతం భూభాగం బీజేపీ లేదా దాని మిత్ర పక్షాల పరిపాలనలో వుంది. కానీ ఇపుడు పరిస్థితి అలా లేదు. మరీ ముఖ్యంగా కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీజేపీ గ్రాఫ్ పడిపోయిందన్న విశ్లేషణలు మీడియాలోను, సోషల్ మీడియాలోను విస్తృతంగా వస్తున్నాయి. అదేసమయంలో నరేంద్ర మోదీకి పెరుగుతున్న ఇంటర్నేషనల్ ఇమేజీ మాత్రం ఎవరికీ అందనంత స్థాయికి చేరింది. తాజాగా అమెరికా, ఈజిప్టు పర్యటనల తర్వాత మోదీ చరిష్మా అమాంతం పెరిగిపోయింది. ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ వున్న నేతల మీద జరిగిన సర్వేలో మోదీ ఏకంగా 76 శాతం ఆమోదాన్ని పొందారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఈ జాబితాలో ఎక్కడో వున్నారు. ఇంకోవైపు ముస్లిం అధినేతలున్న దాదాపు 13 గల్ఫ్ కంట్రీస్ తమ దేశ అత్యున్నత పురస్కారాన్ని నరేంద్ర మోదీకి ఇవ్వడం ద్వారా మోదీ పనితీరుకు ఫిదా అయినట్లు తేటతెల్లం చేశారు. ఇదంతా నాణేనికి ఒకవైపే. మరి ఎన్నికల సంవత్సరంలో మోదీ ఎలాంటి చర్యలు తీసుకోవడం ద్వారా దేశీయంగా తన ప్రభుత్వం ఇమేజీని పెంచుతారు ? ఇదిపుడు చాలా మంది విశ్లేషిస్తున్న అంశం.చరిష్మాలో మోదీని కొట్టే నేత దేశంలో ఎవరు లేరన్నది కొందరికి జీర్ణం కాకపోయినా నిజమేనని చెప్పాలి. అయితే, ప్రభుత్వంలో ఒక్క మోదీ మాత్రమే ఆదరణీయ నాయకుడు అయితే చాలా ? మిగిలిన వారు కూడా అలా వున్నప్పుడే ఎన్నికల్లో ప్రజలను మెప్పించ గలరన్నది చాలా మంది అభిప్రాయం. భారత్ వంటి పెద్ద దేశంలో ఒక్క ప్రధాన మంత్రి మాత్రమే ప్రమాణాలు కలిగిన వ్యక్తి అయితే చాలదు. ఆయన మంత్రివర్గం కూడా ప్రజలను మెప్పించేదిగా వుండాలి. గత తొమ్మిదేళ్ళుగా అన్ని తానై పరిపాలిస్తున్న మోదీకి ఏదైనా మచ్చ వుంది అంటే అది ఆయన కేబినెటేనని చెప్పాలి. మోదీ కేబినెట్‌లో రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, నితిన్ గడ్కరీ, జయ శంకర్, పియూష్ గోయెల్, మన్‌సుఖ్ మాండవీయ వంటి వారు కాస్త ఇండిపెండెంట్‌గా వ్యవహరిస్తూ తమదైన ముద్ర ఆయా శాఖలపై వేస్తున్నారు. మిగిలిన వారిలో చాలా మంది స్వతంత్రంగా వ్యవహరించలేకపోతున్నారన్నది విశ్లేషకుల మాట. చాలా మంది క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నా.. ఒకరిద్దరు అసమర్థులుంటే చాలు మొత్తం మంత్రివర్గానికి చెడ్డపేరు రావడానికి. అలాంటి పరిస్థితే ఇపుడు మోదీ ప్రభుత్వంలో కనిపిస్తుంది. మొన్నటి ఒడిశా రైలు ప్రమాదంతో సంబంధిత మంత్రి అశ్వినీ వైష్ణవ్‌పై ఈ తరహా కామెంట్లే వచ్చాయి. నిజానికి ప్రమాదం జరగడానికి ఇంకా కారణాలు పూర్తిగా తేలకపోయినా ప్రమాదానికి మంత్రి వైఫల్యమూ ఒక కారణమనే చాలా మంది భావిస్తున్నారు. బహుశా ఈ అపప్రథ తప్పించుకోవడానికే కాబోలు అశ్వినీ వైష్ణవ్ .. ప్రమాదం జరిగిన తర్వాత తిరిగి రైళ్ళ పునరుద్ధరణ జరిగే వరకు అంటే దాదాపు 56 గంటల పాటు ప్రమాద స్థలాన్ని వీడలేదు. గతంలో ఏ మంత్రి పని చేయనంతగా గ్రౌండ్ లెవెల్లో అశ్వినీ వైష్ణవ్ పని చేశారు. రాత్రింబవళ్ళు అక్కడి కార్మికులతో మమేకమై ట్రాక్ పునరుద్దరణ జరిగేలా చూశారు. ఈరకంగా ఆయన కొంత మంది అభిమానాన్ని చూరగొనవచ్చు గాక? కానీ ప్రమాదం మచ్చను మాత్రం పూర్తిస్థాయిలో తప్పించలేకపోయారు.

# హైటెక్ విలేజ్ ఆఫ్ ఇండియాకు జనం క్యూ

**గాంధీనగర్ :**

స్కూల్స్, కాలేజ్, వైఫై, కొత్త టెక్నాలజీ, స్ట్రీట్ లైట్లు, సిటీలోని అన్ని సౌకర్యాలు కలిగిన గ్రామాన్ని ఊహించుకోండి ఎలా ఉంటుందో? బహుశా ఇది కేవలం ఊహ మాత్రమే అనుకోవద్దు..ఎందుకంటే.. మన దేశంలోనే ఇలాంటి ఒక గ్రామం ఉంది. అక్కడ మీకు ఇలాంటి సౌకర్యాలన్నీ లభిస్తాయి. ఈ గ్రామం అనేక నగరాల కంటే అభివృద్ధి చెందిందని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు. ఈ గ్రామం గుజరాత్ రాష్ట్రంలో ఉంది. పాఠశాలలు, కళాశాలలే కాకుండా నగరాల్లో లేని సౌకర్యాలు కూడా ఈ గ్రామంలో ఎన్నో ఉన్నాయి. పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరికీ ఇక్కడ నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉంటాయి. ఈ గ్రామం పేరు పుంసరి. హైటెక్ విలేజ్ ఆఫ్ ఇండియాగా పేరొందిన పుంసరి గ్రామాన్ని చూసేందుకు దేశం నలుమూలల నుంచి ప్రజలు, పర్యాటకులు తరలి వస్తుంటారు. ఆసుపత్రి నుండి పబ్లిక్ వైఫై, ఇతర అన్ని సౌకర్యాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి.దేశంలోని అత్యంత హైటెక్ గ్రామంగా పేరున్న పుంసరి విలేజ్‌లో వైఫై హాస్పిటల్, ౦అ స్కూల్ వంటి నగరాల సౌకర్యాల కంటే మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. అందుకే ఈ పుంసరి అభివృద్ధిని చూసి దేశవ్యాప్తంగా తరలివస్తున్న సందర్శకులు ఆశ్చర్యపోతున్నారు. ప్రభుత్వ పాఠశాలల గదుల్లో ఏసీలు ఉండడంతో ఆ ఊరి నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా విద్యార్థులు ఇక్కడ చదువుకునేందుకు వస్తుంటారు. ఈ గ్రామంలో మొత్తం ఐదు పాఠశాలలు ఉన్నాయి. వాటిలో ౦అ సౌకర్యం ఉంటుంది. ప్రజలు వైద్యం కోసం నగరానికి వెళ్లాల్సిన అవసరం లేదు. దీని కోసం అన్ని సౌకర్యాలతో కూడిన ఆసుపత్రులు కూడా అందుబాటులో ఉన్నాయి.గుజరాత్‌లోని ఈ గ్రామంలో మొబైల్ లైబ్రరీ కూడా ఉంది. ఈ లైబ్రరీ ఆటోలో ఏర్పాటు చేశారు. చదుకోవడానికి ఇష్టపడే ఎవరైనా ఈ లైబ్రరీని ఉపయోగించుకోవచ్చు. ఒక నిర్దిష్ట సమయంలో, ఈ లైబ్రరీ సరైన ప్రదేశానికి చేరుకుంటుంది. ప్రజలు తమకు నచ్చిన పుస్తకాలను అక్కడ చదువుతారు. అంతేకాదు.. ఈ పుంసరి గ్రామం ఎంత అత్యాధునికమైనదంటే గ్రామ పంచాయతీలో బయోమెట్రిక్ ఉపయోగించబడుతుంది. రవాణా వ్యవస్థ, స్వచ్ఛమైన రోడ్లు, స్వచ్ఛమైన నీరు, బయోగ్యాస్ ప్లాంట్ మొదలైనవి కూడా ఉన్నాయి.

# కాంగ్రెస్ సీడబ్ల్యూసీలో తెలంగాణ నేతలు

**హైదరాబాద్ :**

కాంగ్రెస్ పార్టీలో అత్యున్నత నిర్ణయాధికారం దానిదే.. అదే సీడబ్ల్యూసీ– కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ.. ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడిగా మల్లికార్జున్ ఖర్గే ఎన్నికైన తరువాత సీడబ్ల్యూసీ ని ఇంకా పునఃవ్యవస్థీకరణ చేయలేదు.. 2024ఎన్నికలు సమీపిస్తుండడంతో అగ్రనాయకత్వం సీడబ్ల్యూసీపై దృష్టి సారించింది. సీడబ్ల్యూసీ సభ్యులను ఎన్నుకోవడానికి ఎన్నిక అవసరం లేదని రాయపూర్ లో జరిగిన కాంగ్రెస్ ప్లీనరీలో తీర్మానం చేశారు. నిర్ణయాధికారం అధ్యక్షుడు ఖర్గేకి కట్టబెట్టారు.. సీడబ్ల్యూసీలో మొత్తం 35 మంది సభ్యులు ఉంటారు. అందులో ఏఐసీసీ 12 మందిని ఎన్నుకుంటుంది. మిగిలిన వారిని అధ్యక్షుడు ఎంపిక చేస్తారు. వీరితో పాటు శాశ్వత సభ్యులు కూడా ఉంటారు. అయితే, ఈసారి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మహిళా, మైనారిటీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించడంతో తెలంగాణ వారికి కూడా మొదటిసారి సీడబ్ల్యూసీ మెంబర్ దక్కనుంది.మరో రెండు రోజుల్లో సిడబ్ల్యూసి పునఃవ్యవస్తీకరణ జరుగనుంది.. తెలంగాణలో ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రానికి కూడా అధిష్టానం అవకాశం కల్పించనుందని సమాచారం.. ఇప్పటికే బీజేపీ సైతం వారి అత్యున్నత పార్లమెంటరీ బోర్డులో రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ కి అవకాశం కల్పించారు.. దీంతో తెలంగాణ నుంచి సీడబ్ల్యూసి రెసులో ఎమ్మెల్యే సీతక్క పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. మహిళా, ట్రైబల్ విభాగంలో అగ్రనేత..కావున రాహుల్ గాంధీ సీతక్క పేరు సూచించినట్లు సమాచారం.. రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్ర సమయంలో కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు నడిచి సీతక్క రాహుల్ దృష్టిని ఆకర్షించారు. అప్పటి నుంచి తెలంగాణకి సంబంధించిన ఏ కార్యక్రమంలో అయినా సీతక్క ని రాహుల్ గాంధీ ప్రత్యేకంగా గుర్తిస్తారు.మరోవైపు సీతక్కతో పాటు కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి, ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్లు సైతం పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. గతంలో సీడబ్ల్యూసీ కోసం జానారెడ్డి ఢిల్లీ వెళ్లారు.. జానారెడ్డికి మద్దతుగా పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి సైతం గతంలో లేఖ రాశారు. సీడబ్ల్యూసీ కోసం నల్గొండ నేతలు గట్టి ప్రయత్నమే చేస్తున్నారు.. గతంలో తనకి సీడబ్ల్యుసీ ఇవ్వాలని కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా కోరారు.. ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా చాలా కాలంగా ప్రయత్నాలు చేస్తున్నారు.. ఈ నేపథ్యంలో ఎవరికి వరిస్తుందనేది.. కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది.

# సైదాబాద్ హనుమాన్ దేవాలయం కూల్చివేతే పై ఉద్రిక్తత

**హైదరాబాద్**

సైదాబాద్ ప్రధాన రహదారి పై ఉన్న పురాతనమైన హనుమాన్ దేవాలయానికి సంబంధించిన మఠలను ఆర్డీఓ వెంకటేశ్వర్లు దేవాలయ కమిటీని, దేవాదాయ శాఖకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తెల్లవారుజామున కూల్చివేశారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు, భక్తులు భారీ ఎత్తున సంఘటన స్థలానికి చేరుకోవడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. స్థానిక కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రెడ్డి ఆర్డీవోను ఫోన్లో సంప్రదించగా ఇష్టానుసారంగా మాట్లాడుతూ ఫోన్ పెట్టేయని బెదిరించడం జరిగింది. దేవాలయ ఈఓ ను సంప్రదించగా మాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కూల్చివేయడం జరిగిందని ఈ దేవయలనికి 2719 గజాల స్థలం ఉన్నది. కూల్చివేయాలంటే మాకు సమాచారం అందించలేదని చెప్పారు. హైకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా ఆర్డీవో వ్యవహరించారని కమిటీ సభ్యులు తెలుపారు. దీనితో ఆర్డీఓ వ్యవహార శైలిని పై భక్తులు భారీ ఎత్తున చేరుకోవడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది

## పునర్విభజన పేరుతో కేంద్రం కుట్రలు

### బీసీ సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య

**హైదరాబాద్**

పార్లమెంట్ అసెంబ్లీ స్థానాల పునర్విభజన పైన కేంద్ర ప్రభుత్వం కుట్ర " అనే అంశంపై జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంపీ ఆర్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్ర । ప్రభుత్వం బీసీలకు ఉపయోగ పడే కులగణన చేయకుండా పునర్విభజన పేరుతో విభ జించు, పాలించు అనే విధంగా కుట్రలు అనం తరం ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల పునర్విభజన పేరుతో మోదీ ప్రభుత్వం కపట నాటకాలాడుతున్నదని ఆరోపించారు.కేంద్రం పార్లమెంట్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి అసెంబ్లీ, చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ల కల్పిం చాలని డిమాండ్ చేశారు. బీసీలకు రాజ్యాంగపర మైన హక్కులను కల్పించకుండా మోదీ ప్రభుత్వం అణిచివేస్తున్నాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశం లో తెలంగాణ అధ్యక్షులుఎర్ర సత్యం, రాష్ట్ర ఉపాధ్యక్షులు చౌటుపల్లి సురేష్ , కార్యదర్శి సుధాకర్, విద్యార్థి నాయకులు రామకృష్ణ , జల్లేపల్లి కిరణ్ యువజన నాయకులు నివాస్, పృధ్వి , కృష్ణ తదితరులు పాల్గొన్నారు..

## యువకుడి మృతిపై సందేహాలు ఉంటే చెప్పండి

### కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ

**కొత్తపేట**

ఎన్టీఆర్ వీరాభిమాని మేడిశెట్టి సాయి మణికంఠ మృతిపై సందేహాలు, సమాచారం ఉంటే తమకు చెప్పాలని డిఎస్పీ కేవీ రమణ అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మోడేకుర్రు శివారు కడలివారిపాలెంలో మేడిశెట్టి సాయి మణికంఠ అనే యువకుడు ఉరి వేసుకుని చనిపోయి ఉన్నట్లు తమ సిబ్బంది గుర్తించారని డిఎస్పి కెవి రమణ విలేకరులకు తెలిపారు. డెడ్ బాడీని పరిశీలిస్తే జేబులో బ్లేడు, ఫోను ఉన్నాయి అన్నారు. బ్లేడుతో చేయి మణికట్టును కోసుకున్నట్లుగా ఉందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపించామన్నారు. మృతుని వివరాలు సేకరిస్తే కాట్రేనికోన మండలం కుప్పిగుంటకు చెందిన వాడిగా చెప్పారు. పదేళ్లుగా అతడి తల్లిదండ్రులు ఉపాధి నిమిత్తం తిరుపతిలో కూలి పని చేసుకుంటున్నారని చెప్పారు. అయితే యువకుడి మృతిపై ఎవరికైనా సందేహాలు ఉన్నా, సమాచారం ఉన్న తమకు తెలియజేయాలన్నారు. ఏదైనా సమాచారం ఇస్తే నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తామని వెల్లడించారు.

## విద్య సామాగ్రి వితరణ

**బద్వేలు**

తిరుమల ట్రస్ట్ బెంగళూరు వారి సహకారంతో బద్వేలు మున్సిపాలిటీ శీలం వారి పల్లె ఎంపీపీ పాఠశాలలో మంగళవారం సుమారు 30 మంది విద్యార్థులకు అర్బన్ ఎస్ఐ కత్తి వెంకటరమణ చేతుల మీదుగా విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేయడం జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అర్బన్ ఎస్ఐ కత్తి వెంకటరమణ పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు యం, రవికుమార్ ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛంతో ఆహ్వానం పలికి శాలువాతో సత్కరించరు అనంతరం విద్యార్థులకు ఎస్ఐ వెంకటరమణ విద్యార్థుల విద్యా విధానంపై అవగాహన కల్పించారు

## యువత ఉజ్వల భవిష్యత్తుకు నాంది

**కౌతాళం**

మత్తు పదార్థాలకు దూరంగా ఉంటు యువత మంచి భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై నరేంద్ర కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం ను జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కౌతాళం గ్రామంలో విస్తృతంగా అవగాహన సదస్సులు,,ర్యాలీలు నిర్వహించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా ఉన్నత పాఠశాల, ప్రతిభ హై స్కూల్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.డ్రగ్స్కు అలవాటు పడిన యువత బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారనియువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యువత మరియు ప్రజలలో కూడా ఈ మత్తు పదార్థాల (గంజాయి , గుట్కా, ఖైనీ, నల్ల మందు, బ్రౌన్ షుగర్, హెరాయిన్) వల్ల జరుగు నష్టాల గురించి,ప్రతి కళాశాల యాజమాన్యం, బోధకులు మరియు విద్యార్థులలో "బాధ్యత" మరియు "జవాబుదారీతనం" తీసుకురావాలని గంజాయి, ఇతర మత్తు పదార్థాల వలన వచ్చే ఆరోగ్య సమస్యల పై ప్రజలలో మరియు యువత లో పూర్తి అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలు విక్రయించి సొమ్ము చేసుకుందామని ఎవరైనా అమాయక ప్రజలు , యువకులు, విద్యార్థుల జీవితాలను ప్రక్క దోవ పట్టించాలని చూస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎవరైనా గంజాయి మరియు మాదకద్రవ్యాలు ఉన్నట్లు ఖచ్చితమైన సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా టోల్ ఫ్రీ నెంబర్ 14500 నెంబర్ కు కాల్ చేసి సమాచారం ఇచ్చినా వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. . కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మరియు టీచర్లు మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇక ఐక్యతా రాగమేనా

**హైదరాబాద్ :**

ఐదు నెలల్లో తెలంగాణతోపాటు ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. వాటిన్నింటి కంటే తెలంగాణపై కాంగ్రెస్ ఎక్కువ ఫోకస్ పెట్టినట్టు కనిపిస్తోంది. అందుకే రెగ్యులర్‌గా తెలంగాణ కాంగ్రెస్ నేతలను ఢిల్లీకి పిలుపిస్తోంది. వారంతా సఖ్యతగా ఉంటూ పార్టీ విజయానికి చేపట్టాల్సిన ప్రోగ్రామ్స్‌ను చెబుతోంది. తెలంగాణలో జోష్ మీద ఉన్న కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి పయనమయ్యారు. ఇన్నాళ్లూ ఉప్పు నిప్పులా ఉన్న వాళ్లంతా ఐక్యంగా ఉంటున్నట్టు కనిపిస్తున్నారు. ఒకరితో ఒకరు సమావేశమై నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ స్పీడ్‌ను మరింత పెంచేందుకు వ్యూహాలకు పదును పెట్టేందుకు సుమారు 40 మందికిపైగా తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేతలు ఢిల్లీకి పయనమయ్యారు. కాంగ్రెస్ అంటే అంతర్గత ప్రజాస్వామ్యం చాలా ఎక్కువ అని ఆ పార్టీ నేతలే సెటైర్లు వేస్తుంటారు. ఆ పార్టీకి బయట శత్రువులతో కంటే లోపల ఉన్న ప్రత్యర్థులతోనే ప్రమాదం ఎక్కువని కూడా చెబుతుంటారు. దానికి కరెక్ట్ ఎగ్జాంపుల్‌గా తెలంగాణ కాంగ్రెస్ ఇన్నాళ్లూ ఉండేది. అయితే కర్ణాటక ఎన్నికల ఫలితాలు చూసిన నేతల మైండ్ సెట్ మారినట్టు కనిపిస్తోంది. అధినాయకత్వం కూడా వారిని ట్యూన్ చేసినట్టు తెలుస్తోంది. అందుకే నేతలంతా ఇప్పుడు ఐక్యరాగం వినిపిస్తున్నారు. ఎప్పుడూ ఢీ అంటే ఢీ అనుకునే రేవంత్‌రెడ్డి, కోమటి రెడ్డి కలిసిపోయి మీటింగ్స్ పెడుతున్నారు. మొన్నటికి మొన్న జూపల్లి, పొంగులేటిని పార్టీలోకి ఆహ్వానించడానికి వీళ్లద్దరూ కలిసి వెళ్లారు. అదే టైంలో రేవంత్ రెడ్డి కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీలో సీనియర్లుగా ఉంటున్న వారి సలహా మేరకే చేరికలు, ఇతర కార్యక్రమాలు ఉంటాయని ప్రకటించేశారు. దీంతో పార్టీలో కొత్త జోష్ కనిపిస్తోంది. తెలంగాణ కాంగ్రెస్‌లో పాజిటివ్ వైబ్ కనిపిస్తున్న వేళ దాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది అధినాయకత్వం. అందుకే కీలమైన నేతలను ఢిల్లీకి పిలిచింది. వీళ్లంతా రాహుల్ గాంధీతో సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో రెగ్యులర్‌గా రాష్ట్రంలో బహిరంగ సభలు పెట్టే అంశంపై చర్చిస్తారు. అదే టైంలో కొత్తగా చేరుతున్న వారిపై కూడా దృష్టి పెట్టబోతున్నారు. ఎవరెవర్ని చేర్చుకోబోతున్నారు. వారికి ఎలాంటి హామీ ఇవ్వాలనే అంశాలపై చర్చిస్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో బాధితులుగా ఉన్న వర్గాలతో మీటింగ్స్ పెట్టి వారికి భరోసా ఇవ్వడం, వారి ఓట్లు గంపగుత్తగా కాంగ్రెస్‌కు పడేలా చేయడంతోపాటు రాహుల్, ప్రియాంకతో భారీ బహిరంగ సభలను పెట్టేలా ప్లాన్ చేస్తున్నారని సమాచారం. వీటిపై ఈ సమావేశం అనంతరం క్లారిటీ వస్తుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బీఆర్ఎస్, బీజేపీలో ఉండలేక ఊగిసలాడుతున్న వారికి కూడా భవిష్యత్‌పై భరోసా ఇచ్చి వారిని పార్టీలోకి అహ్వానించడం కూడా చేయబోతున్నారని టాక్. మరోవైపు షర్మిల విషయంపై కూడా చర్చించే ఛాన్స్ ఉందని సమాచారం. షర్మిల కాంగ్రెస్‌లో విలీనం చేస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. దీన్ని షర్మిల ఖండిస్తున్నప్పటికీ ప్రచారం మాత్రం ఆగడం లేదు. దీనిపై కూడా అధినాయకత్వం నేతలతో మాట్లాడే అవకాశం ఉందని తెలుస్తోంది.

# బలం ఉన్న చోట్ల పోటీ

**నిజామాబాద్ :**

తెలంగాణలో ఎవరు గెలిచినా మజ్లిస్ పార్టీకి మాత్రం ఏడు అసెంబ్లీ స్థానాలు ఖాయమని ప్రతి ఒక్కరూ అనుకుంటారు. అయితే ఈ సారి మాత్రం ఏడు కాదు ఆ సంఖ్యను ఇంకా పెంచుకోవాలని మజ్లిస్ అధినేత నిర్ణయించుకున్నారు. ఇంత కాలం బీఆర్ఎస్ పార్టీతో రహస్య అవగాహన ప్రకారం.. పాతబస్తీలోని ఏడెనిమిది స్థానాల్లో మాత్రమే పోటీ చేసవారు. ఇక ముందు బలం ఉన్న అన్ని నియోజకవర్గాల్లోనూ పోటీ చేస్తామని అంటున్నారు. నిజామాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవల బోధన్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే షకీల్ కు.. ఎంఐఎం నేతల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో పలువురు మజ్లిస్ నేతలపై కేసులు నమోదయ్యాయి. వారిని అరెస్ట్ చేసి జైలుకు పంపడంతో పరామర్శకు మజ్లిస్ నిజామాబాద్ వచ్చారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్‌తో సహకారం విషయంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌తో పొత్తు మాటే ఉండదన్నారు. బీఆర్ఎస్ పార్టీతో పొత్తు విషయం తర్వాత ఆలోచిస్తామని.. ముందు మా క్రికెట్ బ్యాటింగ్ మేము ఆడతాము.. మా స్కోర్ మేము చూసుకుంటాం.. ఆపై ఎవరిని అవుట్ చేయాలి అనేది ఆలోచిస్తామని నర్మగర్భంగా వ్యాఖ్యానించారు. అధికారం ఎప్పుడూ ఎవ్వరికి శ్వాశతం కాదని.. పవర్ మీ చేతిలో ఉందని ఇష్టం వచ్చినట్లు వ్యవహరి స్తున్నారని?. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదని గుర్తుపెట్టుకో వాలని బీఆర్ఎస్ నేతలను హెచ్చరించారు. బోధన్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే షకీల్ పై హత్యా యత్నం చేశారని మా ఎంఐఎంనేతలపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడం హేయమైన చర్య అని అన్నారు. బోధన్ నియోజకవర్గంలో జరుగుతున్న అంతా ప్రజలు గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో బ్యాలెట్ ద్వారా బీఆర్ఎస్ కు ప్రజలు గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు. ఎంఐఎం పార్టీ ఎక్కడైతే బలంగా ఉందో అక్కడ అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని పేర్కొన్నారు. ఎంఐఎం ఎక్కడ పోటీ చేస్తుందో పూర్తి వివరాలు తర్వాత వెల్లడిస్తామని తెలిపారు. ఇండియాలో ఏ ఎన్నికలు అయినా కష్టపడాలన్నారు. తెలంగాణలో ఎక్కడెక్కడ ఎన్ని స్థానాలు పోటీ చేస్తాం అనేది త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. ఎంఐఎం పార్టీ బలపడటం కోసం ముందుగా పని చేస్తామన్నారు.ఆ పై ఏ పార్టీకి మద్దతు ఏ పార్టీతో ముందుకు వెళ్లాలనేది ఆలోచిస్తామని పేర్కొన్నారు. పాట్నా ప్రతిపక్షాల మీటింగ్‌కు తనకు ఆహ్వానం లేదని అసదుద్దీన్ స్పష్టం చేశారు. 2024 లో మోడీని ఓడించేందుకు మేము వ్యక్తిగతంగా శాయశక్తులా ప్రయత్నం చేస్తామని తెలిపారు. తెలంగాణలో మేము కూడా ప్రత్యామ్నాయమే అని చెప్పారు.తెలంగాణలో గెలుపోటములు ప్రజలు నిర్ణయిస్తారన్నారు. గత అసెంబ్లీ సమావేశాల్లో అక్బరుద్దీన్ , కేటీఆర్ మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా అక్బరుద్దీన్ తాము తెలంగాణలో యాభై స్థానాల్లో పోటీ చేస్తామనిప్రకటించారు. ఇప్పుడు అసదుద్దీన్ కూడా అదే తరహాలో ప్రకటనలుచేస్తూండటం ఆసక్తికరంగా మారింది.

# ఎమ్మెల్యేలే దళితబంధు రాబందులు

**హైదరాబాద్ :**

దళితబంధు పథకానికి ఎమ్మెల్యేలే రాబందులు అని చెప్పిన తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్.. మళ్లీ దొంగలకే తాళాలు అప్పజెప్పారనే ఆరోపణలు ఉన్నాయి. అర్హుల ఎంపిక బాధ్యత మరోసారి వాళ్లకే ఇచ్చి.. దళితబంధు పథకాన్ని "కమీషన్ల బంధు" అని చెప్పకనే చెప్పారని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నియోజక వర్గానికి 11 వందల మంది అంటే.. ఒక్కో ఎమ్మెల్యే సగం కమీషన్లు తిన్నా 55 కోట్లు వస్తుందని అన్నారు. అలా 100 నియోజక వర్గాలకు లెక్కలు కడితే 6 వేల కోట్లు అవుతుందని.. దళిత బిడ్డల పేరు చెప్పి ఎన్నికల వేళ ఎమ్మెల్యేలకు వేల కోట్లు దొచిపెట్టే కుట్ర ఇదంటూ ఫైర్ అయ్యారు. కమీషన్లు కొట్టండి, ఎన్నికల్లో ఖర్చు పెట్టండి అంటూ.. సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు బంపర్ ఆఫర్ ఇచ్చారని ఆరోపించారు.పథకం పక్కదారి పట్టిందని, ఎమ్మెల్యేలు పబ్లిక్ గా దోచుకుంటున్నారని వైఎస్ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే దళితబంధు.. ఎమ్మెల్యేల బంధులా మారిందని అన్నారు. సాక్ష్యాధారాలు బయట పెట్టినా.. దొర తీసుకున్న చర్యలు శూన్యం అని పేర్కొన్నారు. కమీషన్ల కహానీ బయట పెడితే.. దొర అవినీతిపై ఎమ్మెల్యేలే తిరగబడతారని భయం పెట్టుకున్నారని వ్యాఖ్యానించారు. దళితబంధు ఎంపిక ప్రక్రియలో ఎమ్మెల్యేల భాగస్వామ్యాన్ని వెంటనే రద్దు చేయాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ డిమాండ్ చేస్తోందని వెల్లడించారు. గ్రామ సభలో కలెక్టర్ ఆధ్వర్యంలోనే అర్హుల ఎంపిక జరగాలన్నారు. ఆర్థికంగా వెనుక బడిన దళిత బిడ్డలకు పూర్తి స్థాయి పరిహారం అందించాలని వివరించారు. కమిషన్లు అడిగిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నట్లు వైఎస్ షర్మిల స్పష్టం చేశారు. వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు షర్మిల రెండు రోజుల్లో ఢిల్లీ వెళ్లనున్నారు. కొద్ది రోజులుగా కాంగ్రెస్ లో పార్టీలో విలీనంపై విస్తృత చర్చలు జరుగుతున్నాయి. రెండు సార్లు తెలంగాణ కాంగ్రెస్ లో చేరికలు , విలీన వ్యవహారాలను చూస్తున్న డీకే శివకుమార్ తో సమావేశం కూడా అయ్యారు. అయితే షర్మిల పార్టీ విలీనం చేసినా తెలంగాణలోనే రాజకీయాలు చేయాలనుకుంటున్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ మాత్రం ఆమెను ఏపీలో రాజకీయాలు చేయాలని కోరుతున్నట్లుగా తెలుస్తోంది. కానీ తాను ఏపీలో రాజకీయాలు చేసే ప్రశ్నే లేదని పూర్తి స్థాయిలో తెలంగాణకే పరిమితం అవుతానని అంటున్నారు. షర్మిల ఏపీలో రాజకీయం చేయడానికి అంగీకరిస్తే వెంటనే విలీనం చేయడానికి హైకమాండ్ వెంటనే అంగీకరించే చాన్స్ ఉంది. కానీ ఏపీలో మాత్రం తన సేవలు ఉపయోగించుకోడానికి లేదని.. కేవలం తెలంగాణకు మాత్రమే అంటే.. హైకమాండ్ ఆలోచించే అవకాశం ఉందని అంటున్నరా?. ఢిల్లీ పర్యటనలో షర్మిల ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# యూ టర్న్ తీసుకున్న మాజీ మంత్రి

**హైదరాబాద్ :**

మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి కాంగ్రెస్ చేరుతున్నట్లు ఇటీవల జోరుగా ప్రచారం జరిగింది. అయితే ఆఖరి నిమిషంలో ఆయన తన అభిప్రాయం మార్చుకున్నారు. కానీ ఆయన అనుచరులు మాత్రం కాంగ్రెస్ వైపు చూస్తున్నారని తెలుస్తోంది. తెలంగాణలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. రాజకీయ వ్యూహాలతో బీఆర్ఎస్ దూసుకెళ్తుంటే... కీలక నేతల చేరికలతో కాంగ్రెస్ యాక్టివ్ అయింది. బీఆర్ఎస్ లో టికెట్లు దక్కవనే ఉద్దేశంతో కొందరు నేతలు కాంగ్రెస్ లోకి టచ్ లోకి వెళ్తున్నారని సమాచారం. మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి కూడా కాంగ్రెస్ తలుపు తట్టారని తెలుస్తోంది. అయితే ప్రగతి భవన్ నుంచి పిలుపుతో ఆయన అభిప్రాయం మార్చుకున్నట్లు సమాచారం. బీఆర్ఎస్ తొలి విడత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన పట్నం మహేందర్ రెడ్డి... 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున తాండూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం ఆయన సీనియార్టీని దృష్టిలో పెట్టుకొని.. పార్టీ హైకమాండ్ ఆయనకు ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టింది. 2018లో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి తాండూర్ నియోజకవర్గంలో పోటీ చేసి, గెలిచిన పైలెట్ రోహిత్ రెడ్డి.. ఆ తర్వాత బీఆర్ఎస్ లో చేరారు. ఆయన పార్టీలో క్రియాశీలకంగా మారారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మళ్లీ ఆయనకే టికెట్ ఇస్తుందనే ప్రచారం సాగుతోంది. అదే జరిగితే పట్నం మహేందర్ రెడ్డికి ఛాన్స్ లేదనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. ఈ క్రమంలో మహేందర్ రెడ్డి పార్టీ మారేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. అయితే మహేందర్ రెడ్డి తనతో పాటుగా తన మద్దతు వర్గానికి సీట్ల కేటాయింపుపైన కాంగ్రెస్ నేతలతో చర్చించినట్లు తెలుస్తోంది. కొందరి సీట్లు ఖరారు అయ్యాయని ఒక జాబితా బయటకు వచ్చింది. మాజీ మంత్రి చంద్రశేఖర్ కు జహీరాబాద్, తీగల అనితకు మహేశ్వరం, కేఎస్ రత్నంకు చేవెళ్ల, తాండూరు నుంచి మహేందర్ రెడ్డికి ఇవ్వాలని..మహేందర్ రెడ్డి సతీమణి సునీతకు చేవెళ్ల లోక్ సభ ఇస్తారని ప్రచారం జరిగింది. అయితే ఈ విషయం ప్రగతి భవన్ కు లీకవ్వడంతో మహేందర్ రెడ్డికి ఫోన్ వచ్చినట్లు సమాచారం. అనంతరం ఆయన తన అభిప్రాయం మార్చుకున్నారని తెలుస్తోంది. అయితే మహేందర్ రెడ్డి అనుచరులు మాత్రం హస్తం పార్టీ వేపు చూస్తున్నారని టాక్ నడుస్తోంది.తాండూర్ నియోజకవర్గంలో ఈసారి కూడా పైలెట్ రోహిత్ రెడ్డి సీటు ఖాయమని తెలుస్తోంది. బీఆర్ఎస్ అధిష్ఠానం నుంచి మహేందర్ రెడ్డికి ఏదైనా హామీ వచ్చిందా? అని అనుచరుల్లో చర్చ జరుగుతోంది. పార్టీ మార్పుపై సంకేతాలు ఇచ్చి ఇప్పుడు సడెన్ గా సీన్ రివర్స్ చేశారని అంటున్నారు. అయితే మహేందర్ రెడ్డి అనుచరుల్లో కొందరు మాత్రం కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. బీఆర్ఎస్ లో టికెట్లు రాకపోతే తమ రాజకీయ భవిష్యత్తు కోసం పార్టీ మారడం తప్పనిసరి అని అంటున్నారు. తెలంగాణ ఎన్నికల సమీపిస్తుండడంతో ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. అనుచరుల ప్రయత్నాలు మహేందర్ రెడ్డికి తలనొప్పిగా మారాయి. ఇప్పుడు వారిని కూల్ చేసేందుకు మహేందర్ రెడ్డి ప్రయత్నాలు మొదలుపెట్టారని సమాచారం.

# బ్యాంకులో ఖాతా కలిగిన ప్రతి ఒక్కరు బీమా చేయించుకోండి

**సంవత్సరం కి 20 రూ చెలిస్తే**

**రెండు లక్షల భీమా**

**అచ్చంపేట్ డిసిసిబి బ్యాంక్ మేనేజర్**

**భూపాల్ రెడ్డి**

**నాగర్కర్నూల్**

సంవత్సరం కి 20 చేస్తే రెండు లక్షల భీమ సౌకార్యం ఉంటుందని అచ్చంపేట్ డిసిసి బ్యాంక్ మేనేజర్ బూపాల్ రెడ్డి అన్నారుమంగళవార సురపూర్ రైతువేదికలో రైతులకు పిఎ సి అంబట్ పల్లి అధ్వర్యం లో ఏర్పాటుచేసిన సమావేశం లో వారు మాట్లాడుతూ 18 -70 సంవత్సరాలలోపు ఉన్నవారికి ఖాతా తీసుకుంటే సంవత్సరానికి ?20 చెల్లిస్తే ఇన్సూరెన్స్ ఎలాంటి ప్రమాదతో మరణించిన రెండు లక్షల భీమ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా 18-50 వయసు వారు 436 రూపాయలు చెల్లిస్తే అనారోగ్యంతో మరణిస్తే రెండు లక్షల ఇన్సూరెన్స్ వర్తిస్తుందని తెలిపారు. క్రాప్ లోన్ తీసుకున్న ప్రతి రైతు రెన్యువల్ చేయాలని సూచించారు. అదేవిధంగా రెండున్నర ఎకరాలు ఉన్న ప్రతి రైతు బర్రెలు గొర్రెలు కోసం ఆరు లక్షల పైన ఎల్టి లోన్స్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా ఇల్లు లేని వారు ఉంటే భూమి కలిగి ఉండి ఉన్నవారికి ఎల్టి లోన్స్ 10 లక్షలు వరకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఇంటర్మీడియట్ కంప్లీట్ అయినవారు పై చదువుల కోసం ఎల్టి లోన్స్ కావలసినవారు భారతదేశంలో చదివే వారికైతే రేపు 10 లక్షల లోపు, ఇతర దేశాలకు చదువు కోసం వెళ్లిన వారికి అయితే 25 లక్షల వరకు ఎల్టి లోన్స్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా గోల్డ్ లోన్స్ కూడా ఇవ్వడం జరుగుతుంది ఒక తుల 35 వేల దాకా ఇవ్వడం జరుగుతుంది అని తెలిపారు. ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మమ్మ శ్రీనివాస్ యాదవ్, సింగిల్ కార్యాలయం సీఈవో పాండు. డైరెక్టర్ నరసింహ, అచ్చంపేట డిసిసిబి బ్యాంకు సూపర్వైజర్ మోహన్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# యువత మత్తుకు బానిసలు కావద్దు

**జగిత్యాల**

యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని,బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని జగిత్యాల జిల్లా సంక్షేమ అధికారి నరేష్ సూచించారు. సీనియర్ సిటీజన్స్,దివ్యంగులు,ట్రాన్స్ జెండర్స్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి వరకు పద్మనాయక కల్యాణ మండపంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధం,అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సదస్సు నిర్వహించారు. ఉదయం వివేకానంద మినీ స్టేడియం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా సాయంత్రం జరిగిన సదస్సులో నరేష్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను చెడు దారులల్లో వెల్లకుండా జాగ్రత్తలు తీసుకోవా లన్నారు. జిల్లా వైద్యాధికారి పుప్పాల శ్రీధర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవించడం వలన ఆరోగ్య,ఆర్థిక సమస్యలు చుట్టు ముడతాయన్నారు.బానిసలైన వారిని మానసిక వైద్యుల వద్ద చికిత్స చేయించాలన్నారు.తెలంగాణ అల్ సీనియర్ సిటీజన్స్ అస్సోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ మత్తు పదార్థాల తయారీదారులు,రవాణా చేస్తున్న వారికి కఠిన శిక్షలు పడేలా చట్టాలను పదును చేయాలన్నారు.ప్రసార మాధ్యమాల్లో ఆల్కహాల్,గుట్కా,సిగరెట్,జర్దా తదితరాలికి సంబంధించిన ప్రకటనలను పూర్తిగా నిషేధించాలన్నారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీ ప్రకాష్ ,డిఎస్డీవో రాజ్ కుమార్,ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రభాకర్ రెడ్డి,జిల్లా అంబుడ్స్ మెన్ అధికారి కృష్ణా రెడ్డి ,డిసిపివో హరీశ్,

# విద్యుత్ ట్రూ ఆఫ్ చార్జీలు తగ్గించాలి

**ఈ నెల 30 తేదీ మండల విద్యుత్ కార్యాలాయాల ముందు ధర్నా**

**నంద్యాల**

రాష్ట్ర ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలను దోచుకునేందుకు మరోసారి విద్యుత్ చార్జీలు పెంచడం దుర్మార్గమని విద్యుత్ చార్జీలను తగ్గించకపోతే ప్రజా ఉద్యమం తప్పదని సిపిఐ నేతలు హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ విద్యుత్ కార్యాలయం ఎదుట జరుగు ధర్నా ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శిఎస్.బాబా ఫక్రుద్దీన్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే . రాధాకృష్ణ పాల్గొన్నారు.




సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు మాట్లాడుతూ నాలుగేళ్లలో జగన్ ప్రభుత్వం ఏడుసార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరిచారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజల వినియోగించిన విద్యుత్ బిల్లులే కాకుండా ఫిక్స్ చార్జీలు, కస్టమర్ చార్జీలు, సర్ చార్జీలు, విద్యుత్ సుంకం, సర్దుబాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీల పేరిట రాష్ట్ర ప్రభుత్వం అధిక వసూళ్లకు పాల్పడుతుందని

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గ అప్పుల కోసం కేంద్రం చెప్పినట్లు తలాడిస్తూ వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తున్నారని, ఇళ్లకు కూడా స్మార్ట్ మీటర్ లు బిగించి కార్పొరేట్ కంపెనీలకు వేల కోట్లు దోచి పెట్టేందుకు జగన్ ప్రభుత్వం సన్నద్ధం కావడం దారుణమన్నారు.

కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసే. అంబానీ ఆదానీ కంపెనీలు స్మార్ట్ మీటర్ల ప్రారంభించడం, స్మార్ట్ మీటర్లు పెట్టాలని మోడీ ఆదేశించడం, జగన్ ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల టెండర్లు పిలవడం ఇవన్నీ అదాని కంపెనీకి ప్రజల సొమ్మును ధారాదత్తం చేసే కుట్రలో భాగమేనని బహిరంగ మార్కెట్లో అధిక రేట్లకు విద్యుత్ కొనుగోలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అవినీతికి పాల్పడుతున్నదన్నారు.

రాష్ట్రములో ప్రతిపక్షంలో ఉండగా బాదుడే బాదుడని విమర్శించిన జగన్మోహన్ రెడ్డి విద్యుత్ దోపిడీ దొంగగా మారడని ఆరోపించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాదుడుపై ప్రజలు మరో విద్యుత్ ఉద్యమానికి సమాయత్తం కావాలని విద్యుత్ సర్దుబాటు చార్జీలు , స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలు రోడ్లపైకి వచ్చి ప్రజలపై మరోసారి జగన్ ప్రభుత్వం సర్ చార్జి పేరుతో విద్యుత్ బాదుడు ను వ్యతిరేకిస్తూ నంద్యాల జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలలో సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ న విద్యుత్ కార్యాలయాల వద్ద జరిగే ఆందోళనలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు. ప్రజానీకం పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# సరోగసి దూడ పేరు పద్మావతి

**తిరుమల:**

దేశంలో తొలిసారిగా పిండ మార్పిడి పద్ధతిలో ఒంగోలు ఆవుకు సాహివాల్ దూడ పుట్టినట్లు టీటీడీ ప్రకటించింది. సాహివాల్ దూడకు పద్మావతిగా నామకరణం చేసినట్లు ఈవో ధర్మారెడ్డి తెలిపారు.

దేశంలో తొలిసారిగా పిండ మార్పిడి (సరోగసి ) పద్ధతిలో ఒంగోలు ఆవుకు సాహివాల్ దూడ జన్మించినట్లు టీటీడీ ఈవో ఏవి ధర్మారెడ్డి తెలిపారు. తిరుపతిలోని ఎస్వీ గోశాలలో ఆదివారం ఈవో మీడియా సమావేశం నిర్వహించారు. ఈవో మీడియాతో మాట్లాడుతూ, సీవీఎస్ జవహర్ రెడ్డి సూచనలతో టీటీడీ, ఎస్వీ పశువైద్య విశ్వవిద్యాలయం సంయుక్తంగా దేశావాళీ గోజాతులను అభివృద్ధి చేయాలని గత ఏడాది ఎంఓయూ కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మేలు రకమైన దేశవాళీ గో జాతిని అభివృద్ధి చేసే క్రమంలో ఎస్వీ గో సంరక్షణ శాల లోని మేలు జాతి ఆవుల నుంచి అండం సేకరించి, ఎస్వీ పశువైద్య విశ్వవిద్యాలయంలోని ఐవీఎఫ్ ల్యాబ్ లో కృత్రిమంగా పిండాలను అభివృద్ధి చేశారన్నారు . వీటిని టీటీడీ గోశాలలోని ఆవులలో ప్రవేశపెట్టి దేశంలోనే తొలిసారిగా విజయం సాధించినట్లు ఈవో తెలిపారు. ఈ ప్రక్రియలో శనివారం రాత్రి ఒంగోలు ఆవుకు జన్మించిన సాహివాల్ దూడకు పద్మావతి అని నామకరణం చేసినట్లు చెప్పారు.తిరుమల శ్రీవారి ఆలయంలో ధూప దీప నైవేద్యాలకు, నిత్య కైంకర్యాలకు అవసరమయ్యే పాలు, పెరుగు, వెన్న, నెయ్యిని దేశవాళీ ఆవుపాల నుంచి ఉత్పత్తి చేయాలని నిర్ణయించినట్లు ఈవో ధర్మారెడ్డి తెలియజేశారు. ఇందుకోసం ఇప్పటికే 200 దేశీయ గోవులను దాతలు సమకూర్చారని, మరో 300 గోవులను సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన చెప్పారు. ఆవుల ఆరోగ్య పరంగా, అధిక పాల దిగుబడి దిశగా నాణ్యత కలిగిన దాణా తయారీ చేసుకోవడానికి ఇటీవలే గోశాలలో ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ ప్రారంభించినట్లు చెప్పారు. అదేవిధంగా గోశాలలో రోజుకు సుమారు 3 వేల నుండి 4 వేల లీటర్ల ఆవుపాలను ఉత్పత్తి చేయనున్నట్లు ఈవో తెలిపారు. రోజుకు 60 కేజీల స్వచ్ఛమైన నెయ్యిని సాంప్రదాయ పద్ధతిలో తయారు చేసి స్వామి వారి నిత్య కైంకర్యం, నైవేద్యాలకు వాడేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. గో ఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో భాగంగా రైతులకు టీటీడీ ఉచితంగా గోవులను అందిస్తోందని అన్నారు. గోశాలలో ఉన్న షెడ్లలో మార్పులను చేయడం, ఇసుక తిన్నెలను ఏర్పాటు చేసి గోవులకు సహజ సిద్ధమైన వాతావరణాన్ని కల్పించామని ఈవో ధర్మారెడ్డి తెలిపారు. గోశాలలోనే కాకుండా తిరుపతి పరిసర ప్రాంతాల్లో సేంద్రీయ పద్ధతుల్లో పండించిన పచ్చి మేతను కొనుగోలు చేసేందుకు కలెక్టర్ తో సంప్రదించామన్నారు. రానున్న రోజుల్లో ఇంకా మెరుగైన ఫలితాలు పొందేందుకు వీలుగా నూతన షెడ్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. ఎస్వీ పశు వైద్య విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ పద్మనాభరెడ్డి మాట్లాడుతూ.. రానున్న 5 సంవత్సరాల్లో 324 మేలు రకమైన సాహివాల్ గోజాతి దూడలను ఉత్పత్తి చేస్తామన్నారు. దీనిలో భాగంగా పిండ మార్పిడి చేసిన ఆవులలో ఇప్పటి వరకు 11 గోవులు గర్భం దాల్చినట్లు తెలిపారు. ఒక ఆవు శనివారం రాత్రి సాహివాల్ పెయ్య దూడకు జన్మనిచ్చిందన్నారు. రానున్న రోజుల్లో ఇంకా 10 సాహివాల్ దూడలు జన్మించనున్నాయని తెలియజేశారు. ఇదే కాకుండా లింగ నిర్ధారిత వీర్యాన్ని ఎస్వీ గోశాలలో ఉన్న సాహివాల్, గిర్ గోవులలో కృత్రిమ గర్భధారణ ద్వారా ప్రవేశపెడతామన్నారు . దీనివల్ల సరోగసి చెందే ఆవు లక్షణాలు దూడకు రావని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా మేలు రకమైన దేశీయ జాతి గోవులను రైతులకు సబ్సిడీపై అందించవచ్చని ఆయన వివరించారు

# ఓవర్ టూ ఢిల్లీ...

**హైదరాబాద్ :**

ఢిల్లీ సెంట్రిక్‌గానే ఇప్పుడు తెలంగాణ రాజకీయం నడుస్తోంది. అటు కాంగ్రెస్ నేతలంతా ఢిల్లీ బాట పడుతుంటే.. ఇటు బీజేపీ నేతలు కూడా హస్తినలోనే మకాం వేశారు. తెలంగాణ రాజకీయాల్లో పార్టీ పరిస్థితులపై ఫోకస్ పెట్టిన బీజేపీ అధిష్టానం.. ముఖ్య నేతలతో భేటీ అవుతోంది. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో బండికి ఢిల్లీ నుంచి పిలుపు రావడం ఆసక్తికరంగా మారింది. తెలంగాణ బీజేపీ నేతలతో బీజేపీ జాతీయ నాయకత్వం వరుసగా జరుపుతున్న చర్చల వెనుక ఉన్న అసలు మర్మం ఏంటి..?తెలంగాణలో కాషాయ జెండాను రెపరెపలాడించాలని చూస్తున్న బీజేపీ క్రమక్రమంగా స్పీడ్ పెంచుతోంది. ఈ క్రమంలోనే కీలక నేతలను ఢిల్లీకి పిలిపించుకుని చర్చలు జరుగుతోంది జాతీయ నాయకత్వం. ఇటీవలే ఈటెల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో భేటీ అయిన బీజేపీ పెద్దలు.. రాష్ట్ర రాజాకీయాల్లో తాజా పరిస్థితులపై చర్చించారు. ఇరువురి నాయకుల వెర్షన్ ఏమిటనేది క్లియర్‌గా విన్నారు. ఈ క్రమంలోనే ఇప్పుడు ఢిల్లీ నుంచి బండికి పిలుపు వచ్చింది. దీంతో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు సంజయ్ కూడా హుటాహుటిన ఢిల్లీ పెద్దలను కలిసేందుకు హస్తినకు బయలుదేరారు.కర్ణాటక ఎన్నికల్లో ఓటమి తర్వాత తెలంగాణ బీజేపీలో జరిగిన పలు అనూహ్య పరిణామాలు పార్టీ ప్రతిష్టను దెబ్బతీశాయనే చర్చలు ఉన్నాయి. కమల నేతల వివాదాస్పద కామెంట్లు, నాయకుల తీరు పార్టీకి నష్టం కలిగించేలా ఉన్నాయనే వాదన కూడా లేకపోలేదు. ఈ పరిస్థితులు ఇలాగే ఉంటే దక్షిణాదిలో పాగా వేయడం కష్టమేనని బీజేపీ హైకమాండ్ భావించి నేతలతో ఈ సమీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఇంకా పార్టీలోని అసంతృప్త నేతలతో భేటీ అనంతరం బండి సంజయ్ ఢిల్లీ టూర్‌పై ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో బండికి ఎలాంటి అంశాలపై హైకమాండ్ దిశానిర్దేశం చేయనుందనే చర్చ జరుగుతోంది.

# అప్రమత్తతే ముఖ్యం... ఫెన్సింగ్ సాధ్యం కాదు

**తిరుపతి :**

ఇటీవల అలిపిరి నడక దారిలో చిన్నారిపై చిరుత దాడి దురదృష్టకర ఘటన అని ప్రిన్సిపల్ చీఫ్ అటవీ సంరక్షణ అధికారి మధుసూదనా రెడ్డి అన్నారు. నడక దారికి ఇరువైపుల కంచె నిర్మాణం సాధ్యం కాదని, చీకటి పడ్డాక భక్తులు కొండపైకి గుంపులు గుంపులుగా వెళ్లాలని సూచించారు. సోమవారం తిరుపతిలోని ఎర్రచందనం గోడౌన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అలిపిరి నడక మార్గంలో చీకటి పడ్డాక గుంపులుగా వెళ్ళాలని భక్తులకు సూచించారు. చిరుత అధికంగా సంచరించే ప్రదేశాల్లో మరిన్ని కెమెరా ట్రాప్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇంకా తల్లి చిరుత సంచరిస్తోంది అనడానికి ఆనవాళ్లు లేదని, చిరుత ఇక్కడ సాధారణంగా మనుషులపై దాడి చేయలేదని, చాలా అరుదుగానే ఈ ఘటన జరిగిందన్నారు. నడక దారిని శుభ్రంగా ఉంచాలని కోరారు. భక్తులు భయాందోళనకు గురి కాకుండా కాలి నడకన తిరుమలకు వెళ్ళవచ్చని ఆయన తెలిపారు. తిరుమల అటవీ ప్రాంతంలో ఎన్ని చిరుతలు ఉన్నాయన్న స్పష్టమైన సమాచారం తమ వద్ద లేదన్నారు. అలిపిరి నుంచి కొండపైకి నడకదారికి ఇరువైపులా కంచె నిర్మాణం సాధ్యం కాదని, కొన్ని ప్రత్యామ్నాయాలు పరిశీలిస్తున్నామని చెప్పారు. చిరుతలు స్వేచ్ఛగా తిరిగేలా కొన్ని మార్గాల్లో వాటికి ప్రత్యేక రహదారి నిర్మించే ప్రతిపాదన పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై టిటిడి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవోలతో చర్చించనున్నామని తెలిపారు. చిత్తూరు జిల్లాలో ఏనుగుల కోసం ఎలివేటెడ్ ఎక్స్ ప్రెస్ లు నిర్మించాల్సి ఉందని, చిత్తూరు జిల్లాలో ఏనుగుల బెడదపై కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల అటవీ అధికారులతోనూ ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని ఆయన తెలిపారు. 5400 మెట్రిక్ టన్నులు ఎర్రచందనం అమ్మకాలకు అనుమతి వచ్చిందని, మొదటి విడతలో కొంత విక్రయించామని, రెండవ విడత అమ్మకాలు త్వరలో ప్రారంభం అవుతుందన్నారు. ఎర్ర చందనానికి విదేశీ డిమాండ్ ఈ మాత్రం తగ్గలేదన్నారు. కొన్నేళ్ల కిందట నల్లమల నుంచి పెద్దపులి శేషాచల అడవుల్లోకి వచ్చినట్లు తమకు ఆనవాళ్లు లభించాయని, ఇటీవల కాలంలో ఇక్కడకు పెద్దపులి వచ్చిన దాఖలాలు లేవని చెప్పారు.అటవీ శాఖ గానీ, టీటీడీ గానీ ఎంత మానిటర్ చేసినా దట్టమైన అటవీ ప్రాంతంలో జరుగుతున్న వాటిని నియంత్రించడం అంత చిన్న విషయం కాదన్నారు. ఇక్కడ జంతువులు స్థిర నివాసం ఏర్పరుచుకుంటున్నాయి. గతానికి ఇప్పుడు పోల్చితే ఏనుగుల సంఖ్య భారీగా పెరిగిందన్నారు. న్యూ గ్రీన్ ఫిల్డ్ ఎక్స్ ప్రెస్ వే వస్తే జంతువులు ఈజీగా రోడ్లు క్రాస్ చేయడం సాధ్యపడుతుంది. ఏనుగులకు, ఇతర వన్యప్రాణులు స్వేచ్ఛగా తిరుగుతాయని, వాటిని అన్నిచోట్ల అడ్డుకునే పరిస్థితి ఉండదన్నారు. ప్రతి చోట ఫెన్సింగ్ వేసి వన్య ప్రాణులు స్వేచ్ఛగా వెళ్లకుండా చేయలేమన్నారు. టీటీడీ అధికారులతో చర్చించి చిరుత, ఏనుగులు లాంటి వన్య ప్రాణులు ఫ్రీ పాసింగ్ అయ్యేలా ఏర్పాట్లు చేసేందుకు సిద్ధమని తెలిపారు. జూ పార్కుకు అవసరమైన నిధులను టీటీడీ అందిస్తుంది. కెమెరా ట్రాప్స్ ఏర్పాటు చేసి, తల్లి చిరుతను త్వరలోనే పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలివేస్తామని చెప్పుకొచ్చారు.

# హన్మకొండ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**నలుగురు స్పాట్ డెడ్**

**ఇద్దరి పరిస్థితి విషయం**

**మేడారం తల్లుల దర్శనానికి వెళ్లి**

**వస్తుండగా ఘటన**



**హన్మకొండ**

హన్మకొండ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆత్మకూరు, కటాక్షపూర్ ప్రధాన రహదారిపై జరిగిన ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు. కారు డ్రైవర్ తో పాటు మరొకరికి తీవ్ర గాయాలయ్యాయయి. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వీరంతా కారులో మేడారం సమ్మక్క సారలమ్మ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఈ ఘటన జరిగింది. టిప్పర్ బలంగా ఢీకొట్టడంతో కారు నుజ్జునుజ్జు కాగా, తీవ్ర గాయాలపాలైన వారు కారులోనే ప్రాణాలు విడిచినట్లు స్తానికులు చెబుతున్నారు. చనిపోయిన వారిలో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని కాశీబుగ్గ వాసులు. మృతిచెందిన వారిలో అనుముల నరసింహ చారి, వెల్దండి సాంబరాజు, వెల్దెండి ఆకాంక్ష, వెల్దండి లక్ష్మి ప్రసన్న ఉన్నారు. తీవ్రంగా గాయపడిన వారు ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

# బైపాస్ రోడ్డు కల సాకారం చేయండి

**-అర్బన్ మండలం కోరుతూ సంతకాల సేకరణ..**



**పెద్దపల్లి**

వేగంగా విస్తరిస్తున్న పెద్దపల్లికి బైపాస్ రోడ్డు లేక నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని పట్టణ ప్రజల విజ్ఞప్తి మేరకు వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పెద్దకల్వల నుండి అప్పన్నపేట వరకు బైపాస్ రోడ్డు నిర్మించాలని, పెద్దపల్లిని అర్బన్, రూరల్ మండలాలుగా విభజించాలని కోరుతూ సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా కో ఆర్డినేటర్ ఈర్ల స్వరూప సురేందర్ మాట్లాడుతూ, 15యేళ్ళ క్రితం ఎమ్మెల్యే దివంగత ముకుందరెడ్డి బైపాస్ రోడ్డును కోరుతూ ప్రభుత్వానికి నివేదికలు అందజేశారని, ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఉత్తర-దక్షిణ భారతాన్ని కలిపే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వేలది భారీ వాహనాలు పెద్దపల్లి గుండా ప్రయాణిస్తున్నా యని, దీనివల్ల అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతూ ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాల్లో మరణించిన వారిలో పోలీసు శాఖకు చెందిన మహిళా ఏఎస్ఐ కూడా ఉండటం విచారకరమని వాపోయారు. అడగకుండానే జిల్లాగా ప్రకటించిన ముఖ్యమంత్రి కేసీఆర్, బైపాస్ రోడ్డు నిర్మాణంపై కరుణ చూపాల ని కోరారు. బైపాస్ రోడ్డు నిర్మాణానికి సాంకేతిక కారణాలు ఎదురయినట్లయితే, పెద్దపల్లి పట్టణం నుండి ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని అదేవి ధంగా పరిపాలనా సౌలభ్యం కోసం పెద్దపల్లి అర్బన్, రూరల్ మండలాలను ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ గూటికి చేరుతున్నాం

**క్లారిటీ ఇచ్చిన పొంగులేటీ, జూపల్లి**

**న్యూఢిల్లీ :**






బీఆర్ఎస్ నుంచి బయటికి వచ్చిన ఖమ్మం జిల్లా కీలక నేత, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లుగా ప్రకటించారు. తాను జూలై 2 రాహుల్ గాంధీ సమక్షంలోనే కాంగ్రెస్ కండువా కప్పుకుంటానని స్పష్టం చేశారు రాహుల్ గాంధీని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు సహా పార్టీకి చెందిన 35 మంది కీలక నేతలు కలిశారు. ఢిల్లీ వెళ్లి వీరంతా ఏఐసీసీ కార్యాలయంలో సమావేశం అయ్యారు. సమావేశం తర్వాత పొంగులేటి మీడియాతో మాట్లాడారు. బీఆర్ ఎస్ నుంచి బయటకు వచ్చాక ఏ మార్గంలో వెళ్లాలనే అంశంపై అనేక మంది అభిప్రాయాలు తీసుకున్నానని పొంగులేటి చెప్పారు. జూపల్లిలో కలిసి అనేక సభలు సమావేశాలు నిర్వహించి, ప్రజలు ఏం కోరుకుంటున్నారనే అభిప్రాయాలు తీసుకున్నామని చెప్పారు. గత మూడు నెలలుగా సర్వేలు చేయించుకున్నామని, 80 శాతానికి పైగా ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఉందని అన్నారు. ఒక పార్టీ పెట్టే అంశంపై కూడా చాలా మందిని అడిగినట్లు చెప్పారు. పార్టీ పెడితే ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలుతుందని, అలా జరగకుండా చూడాలని చాలా మంది చెప్పారని అన్నారు. తన అనుచరులు, ప్రజల అభిప్రాయం మేరకు తాను కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. పదవులు ఇవ్వలేదని పార్టీ మారానని అనడం సరి కాదని అన్నారు. తెలంగాణ వస్తే మంచి జరుగుతుందని సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారని అన్నారు. ప్రత్యేక రాష్ట్రాన్ని తెచ్చుకున్నా అనుకున్నది జరగడం లేదని, నీళ్లు, నిధులు, నియామకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. తెలంగాణ బిడ్డలు ఆత్మగౌరవాన్ని కోల్పోతున్నారని ఆవదేన వ్యక్తం చేశారు.జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. నష్టం వస్తుందని తెలిసినా ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ వెంటనే తాను నడవాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. వచ్చే నెల 2న రాహుల్ గాంధీ సమక్షంలో చేరతానని వెల్లడించారు. కేసీఆర్ నియంతృత్వ ధోరణి పరాకాష్ఠకు చేరిందని.. మంత్రుల్ని కూడా సీఎం కేసీఆర్ మనుషులుగా చూడడం లేదని అన్నారు. ఈ సారి కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వకపోతే ప్రజల్ని దేవుడు కూడా క్షమించడని అన్నారు. తెలంగాణ వచ్చాక తమ అంచనాలన్నీ తప్పాయని.. కేసీఆర్ పాలన అంతా బోగస్ మాటలు, పథకాలతో సాగుతోందని విమర్శించారు. ఎప్పటికప్పుడు కొత్త పథకాలతో జిమ్మిక్కులు చేస్తూ.. ప్రశ్నించే గొంతే ఉండొద్దని కేసీఆర్ భావిస్తున్నారని అన్నారు. కేసీఆర్ తీరు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను కూడా అవమానించేలా ఉందని అన్నారు. దేశంలో ఎన్నడూ లేనంతగా ప్రచారానికి ప్రజల డబ్బును ఖర్చుపెడుతున్నారని జూపల్లి కృష్ణారావు విమర్శించారు.

## కనీవినీ ఎరుగని సభ

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నప్పటికీ అనుకున్న అభివృద్ధి జరగలేదని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ పాలనపై విమర్శలు చేశారు. అందుకే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నానన్న ఆయన... జులై 2న పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. రాష్ట్రం ఏర్పడినా తెలంగాణ బిడ్డలు ఏం కోరుకున్నారో అవి జరగలేదని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబం అవినీతి వల్ల ప్రజలకు దక్కాల్సినవి దక్కడం లేదన్నారు. మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. జులై 2 ఖమ్మంలో కనీవినీ ఎరుగని సభ నిర్వహిస్తామన్నారు. కేసీఆర్ కు అధికారం ఇచ్చినందుకు రాష్ట్రంలో ఏం జరుగుతుందో అందరికీ తెలుసన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కేసీఆర్ దెబ్బతీశారని విమర్శించారు. తనను బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేశారనో, పదవుల కోసమే తాను పార్టీ మారడంలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకే కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు పొంగులేటి స్పష్టం చేశారు. పదవులు ఇవ్వలేదని బీఆర్ఎస్ నుంచి బయటకు రాలేదన్నారు. బీఆర్ఎస్‌ను గద్దె దించేందుకే పార్టీ నుంచి బయటకు వచ్చి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వెల్లడించారు. తనకు పదవులు ముఖ్యం కాదన్న ఆయన... పదవుల కంటే తనకు ఆత్మాభిమానమే ముఖ్యమని తెలిపారు. ఓ దశలో ప్రాంతీయ పార్టీ పెట్టాలని భావించినా...కొత్త పార్టీతో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలుతుందని భావించికాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు.

# మాంగళ్యాన్ని నిష్టతో చేసేది స్వర్ణకారులే

**పెద్దపలి**



హిందూ వివాహ సాంప్రదాయంలో అతి ప్రాముఖ్యత గల మాంగళ్యాన్ని ఎంతో నిష్టతో తయారు చేసేది స్వర్ణకారులేనని పెద్దపల్లి నియోజకవర్గ విశ్వబ్రాహ్మ ణ పురోహిత సంఘం, పెద్దపల్లి జిల్లా స్వర్ణకార సంఘం నాయకులు స్పష్టం చేశారు. వివాహ సమయంలో వరుడు వధువు మెడలో కట్టే మంగళసూత్రం ప్రాధాన్యతను వివరిస్తూ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, కార్పోరేటు షోరుములు చేస్తున్న ప్రకటనలను చూసి ప్రజలు రెడీమేడ్ మాంగళ్యాల ను కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్న వారు కేవలం స్వర్ణకారులు మాత్రమే హిందూ సంస్కృతి, సాంప్రదాయాలను పాటిస్తూ నాణ్యమైన మాంగళ్యాలను తయారు చేస్తారని తెలిపారు. సాంప్రదాయలకు విరుద్దంగా మంగళ్యాలను తయారు చేసే వారికి దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు రంగు శ్రీనివాస్, శ్రీరామోజు రాజు, కోశాధికారి కనపర్తి భాస్కర చారి, గౌరవ అధ్యక్షులు బసవపా త్రుని వెంకట నరసయ్య, రాష్ట్ర స్వర్ణకార సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ కందుకూరి ప్రకాష్ రావు, జిల్లా స్వర్ణకార సంఘం నాయకులు విజయగిరి శ్రీనివాస్, విజయగిరి వెంకటేష్, బెజ్జంకి శ్రీనివాస్, పెద్దపల్లి నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ పురోహిత సంఘం అధ్యక్షులు కందుకూరి ఈశ్వరాచారి, ఇంకా అధిక సంఖ్యలో పురోహితులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థుల కోసం ఎంతో కృషి

**ఎఫ్ఆర్డీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్ యాదవ్**

**నాగర్ కర్నూల్**

గ్రామీణ ప్రాంతాలలో ఉన్న నిరుపేద కుటుంబాలలో వెలుగులు నింపుతు పేద విద్యార్థులకు ఎంతో అండగా ఉండి విద్యార్థుల చదువు కోసం వివిధ హాస్టల్లో చేర్పించి వారిని ఆదుకుంటున్నా ఫౌండేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్ యాదవ్, వారి సొంత డబ్బులతో కష్ట పడి వారి కోసము హాస్టల్లో చేర్పిస్తూ ప్రతిరోజు ఉదయం నుండి రాత్రి వరకు కూడాబాలల హక్కులపై పనిచేస్తున్నారు. గత 2000-2003 సంవత్సరంలో మామిడిపూడి వెంకటయ్య ఫౌండేషన్ లో గ్రామం మోబులేజర్ గా దత్తారం, జీలుగుపల్లి గ్రామాలలో బాల కార్మికుల కోసం , ఇల్లు తిరిగి వారికి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వారిని పాఠశాలలో చదివించే విధంగా కృషి చేశారు..2003-2006 వరకు శ్రామిక వికాస కేంద్రం స్వచ్ఛంద సంస్థ ఆర్ బి సి, ఎస్ సి ఎల్ పి, కేంద్రాలు నిర్వహించి పేద విద్యార్థులకు చేరదీయడం జరిగింది.2006 ఏప్రిల్ నుండి 2023 ఏప్రిల్ వరకు పానుగల్, పెద్దకొత్తపల్లి, లింగాల, మండలాలలో మండల కోఆర్డినేటర్ గా సామాజిక కార్యకర్తగా పనిచేస్తూ , గ్రామాలలో సమావేశాలు సదస్సులు ఏర్పాటు చేసి బాలల హక్కుల కోసం కృషి చేశారు. బాల్య వివాహాలు ,బాల కార్మికులు, అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు, తదితర విషయాలపై పనిచేస్తూ ప్రజలను చైతన్యవంతం చేసి ముందుకు వస్తున్నారు.2007లో పానుగల్ మండలం నిజమాబాద్ గ్రామానికి చెందిన ముగ్గురు పిల్లలకు తల్లిదండ్రులు లేకపోవడంతో అప్పుడు ఉన్న ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా కలెక్టర్ ఉషారాణి దగ్గరికి తీసుకువెళ్లి వారిని చేరదీసి రెడ్ క్రాస్ సొసైటీలో చేర్పించడం జరిగింది. కలెక్టర్ ఉషారాణి కూడా శ్రీనివాస్ యాదవ్ కు అభినందించార. ఇంతే కాకుండ వందల మంది నిరుపేద పిల్లలను బడి బయటి పిల్లలను చేరదీసి వివిధ హాస్టల్లో చేర్పించడం జరిగింది. అదేవిధంగా లింగాల మండలం మారుమూల గ్రామాలైన ఎర్ర పెంట, శ్రీరంగాపూర్, తదితర గ్రామాలలో గిరిజన కుటుంబాల పిల్లలకు చేయూతలందిస్తూ కృషి చేశారు. అనంతరం 2012లో ఫౌండేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ సంస్థ తను సొంతంగా ఏర్పాటు చేశారు. అప్పటి నుండి కూడా నేటి వరకు బాలల హక్కులపై పనిచేస్తూ వస్తున్నారు. మంగళవారం సురాపూర్ గ్రామంలో తల్లిదండ్రులు లేనటువంటి పిల్లలతో మరియు నిరుపేద కుటుంబాల పిల్లలకు నాగర్ కర్నూల్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందుకు తీసుకువెళ్లి వారికి వివిధ పాఠశాలలో హాస్టల్లో వసతులు కల్పించడం జరిగింది. నిరుపేద కుటుంబాలకు ఎంతో అండగా ఉండి బాలల హక్కుల పై నిరంతరం శ్రమించి పనిచేస్తున్న శ్రీనివాస్ కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# మహాధర్నాకు వేలాదిగా తరలి రండి

**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జీప్ జాతద్వారా ప్రచారం...**

**గోస్పాడు**

జూన్ 30వ తేదీన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతాంగ సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో నిర్వహిస్తున్న మహాధర్నాల్లో జిల్లా రైతాంగం పాల్గొనాలని కోరుతూ గోస్పాడు మండలంలోని గోస్పాడు, జూలపల్లి,, పసులపాడు, చింతకుంట, శ్రీనివాసపురం, యాలూరు గ్రామాల్లో రైతు సంఘం నాయకులు జీపు జాత ద్వారా కరపత్రాలు పంచుతూ, వాల్ పోస్టర్లు, పాటల ద్వారా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోస్పాడు లో జరిగిన సభలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు టి ,రామచంద్రుడు, సురేష్, గోస్పాడు మండల కార్యదర్శి జి. శ్రీనివాసరెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మార్క్ వారు మాట్లాడుతూ, నంద్యాల జిల్లాలోని రైతాంగం సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లేందుకు ఈ నెల 30వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ నందు రైతుల మహాధర్న నిర్వహిస్తున్నామని, ప్రధానంగా సాగునీరు, విత్తనాలు, ఎరువులు, పంట రుణాలు, మద్దతు ధరలు, బీమా సౌకర్యం, అకాల వర్షాల వల్ల పంట నష్టం పరిహారం, మొదలు సమస్యలను పైన ముఖ్యమంత్రి కి విన్నవించుకోవడం జరుగుతుందన్నారు. నకిలీ విత్తనాలు ఎరువుల వల్ల రైతాంగం నష్టపోకుండా ఉండేందుకై ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని రకాల నాణ్యమైన విత్తనాలు ఎరువులు ఇవ్వాలని, బ్యాంకుల ద్వారా రైతులందరికీ పంట రుణాలు ఇవ్వాలని, సున్నా వడ్డీ పావలా వడ్డీ రుణ పరిమితులను మించి ఇవ్వాలని, డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సూచించిన విధంగా సీటు ప్లస్ 50 ఫార్ములా ఆధారంగా మద్దతు ధరలు నిర్ణయించి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ధరలు కచ్చితంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, మధ్య జరార్ల దోపిడీ నుండి రైతాంగం నష్టపోకుండా ప్రభుత్వాలే అన్ని రకాల పంటలను కొనుగోలు చేయాలని, గత సంవత్సరం కురిసిన అధిక, అకాల వర్షాల వల్ల మరియు నకిలీ విత్తనాల వల్ల పద్ద నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం చెల్లించాలని బీమా సౌకర్యం కల్పించాలని, భూ యజమాని ఒప్పంద పత్రంతో సంబంధం లేకుండా గ్రామ సభ ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి అన్ని రకాల వసతులు కౌలు రైతులకు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. జిల్లాలో ఉద్యానవన పంటల అభివృద్ధి కోసం 90 శాతం సబ్సిడీతో డ్రిప్స్, స్ప్రింక్లర్ సౌకర్యం కల్పించాలని, ఈ సంవత్సరం ఏప్రిల్ మే నెలలో గడిచినటువంటి గాలి వర్షాల వల్ల నష్టపోయిన మామిడి, బొప్పాయి, అరటి పండ్లు తోటల రైతులను ఆదుకోవాలని, నాసిరకం నిర్మాణం వల్ల కృంగిపోయిన గోరుకల్లు రిజర్వాయర్ ఆనకట్ట మరమ్మత్తుపనులను, అలుగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులను వెంటనే చేపట్టాలని, ఎస్సార్ బీసీ, తెలుగు గంగ, కేసీ కెనాల్ కాలువల కింద అసంపూర్తిగా ఉన్న పంట కాలువలను పూర్తి చేసి ఆయకట్టు చివరి భూములకు నీళ్లు అందించాలని, పాణ్యం, గడివేముల, అవుకు, కొలిమిగుండ్ల మండలాల్లో సోలార్ పరిశ్రమల వల్ల మరియు 167 కె జాతీయ రహదారి నిర్మాణం వల్ల జిల్లాలోని వివిధ మండలాల్లో భూములు కోల్పోతున్న రైతాంగానికి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ జరిగేటటువంటి ధర్నాలో జిల్లాలోని రైతులందరూ రాజకీయాలకతీతంగా విజయవాడ మహా ధర్నాకు తరలి రావాలని ఆరు పిలుపునిచ్చారు.

# దళితబంధు పథకంలో ప్రాధాన్యత కల్పించాలి

**పెద్దపల్లి**

రాష్ట్ర ప్రభుత్వం దళితుల కోసం ప్రవేశపెట్టిన దళితబంధు పథకంలో ఎస్సి ఉపకులాలకు తగిన ప్రాధ్యాన్యత కల్పించాలని ఎస్సి, ఉపకులాల హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేటు ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరింనగర్ జిల్లా అధ్యక్షుడు బానాల రాజారాం మాట్లాడుతూ, అత్యంత వెనుకబడిన దళిత ఉపకులాలకు చెందిన మోచి, డక్కలి, చిందు, మాస్టిన్, హోలియదాసరి, బొంబర, బైండ్ల, మాలజంగం, బాదాసి కురువ, మిత అయ్యవార్లు, సమగర బేడజంగం, మహర్, నేతకాని, గోసంగి, మాలదాసరి, తదితర దళిత జాతులకు 40శాతం యూనిట్లను కేటాయించాలని కోరారు. రెండవ విడుత దళిత బందులో అయినా తమ ఉపకులాలకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిందుయక్షగాణ కళాకారుల సంఘం గౌరవ అధక్షుడు గడ్డం ఈశ్వరయ్య, నాయకులు దంతెనపల్లి ధర్మయ్య, గడ్డం తిరుపతి, గడ్డం కుమార్, గడ్డం రవీందర్, గడ్డం శ్రీను, గడ్డం చక్రి, తదితరులు పాల్గొనారు.

# ఎన్సీసీ క్యాడెట్లు మత్తు పదార్థాలపై అవగాహన ర్యాలీ

**శ్రీకాకుళం**

మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురజాడ విద్యాసంస్థల గాయత్రి కళాశాల ఎన్సిసి క్యాడెట్లు మునసబు పేట గ్రామంలో ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్రజలు మత్తు పదార్థాలకు బానిస కావద్దంటూ, అక్రమ రవాణాను అరికట్టాలంటూ నినాదాలు చేస్తూ ప్రజలను చైతన్య పరిచారు. అలాగే ర్యాలీ అనంతరం మత్తు పదార్థాలు మాదక ద్రవ్యాలుకువినియోగించమని, అక్రమ రవాణాను అడ్డుకుంటామని ప్రజలకు మాదకద్రవ్యాల పట్ల అవగాహన కలిపించి వాటి బారిన పడకుండా కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్సిసి అధికారి కెప్టెన్ వంగా మహేష్ మాదక ద్రవ్యాల నిరోధక చట్టాలు, మాదకద్రవ్యాల బారిన పడితే జీవితం ఏ విధంగా నాశనం అవుతుందని



తెలిపి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకోవడానికి ప్రభుత్వంతో కలిసి పని చేయాలని క్యాడిట్లకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న క్యాడెట్లకు గురజాడ విద్యాసంస్థల అధినేత జీవీ స్వామి నాయుడు సంచాలకులు సంయుక్త కరస్పాండెంట్ అంబటి రంగారావు ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, అధ్యాపక బృందం అభినందనలు తెలియజేశారు.

# మృతుడి కుటుంబానికి 10 లక్షల భీమా చెక్కు

**జగిత్యాల**

ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులకు కరీంనగర్ పోస్టల్ సూపరిండెంట్ శ్రీనివాసరావు మంగళవారం రూ. 10 లక్షల ప్రమాద భీమా చెక్కును అందజేశారు.జిల్లాలోని కొడిమ్యాల మండలం, డబ్బు తిమ్మయ్యపల్లి గ్రామానికి చెందిన , లయి శెట్టి వెంకటేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతను పోస్ట్ ఆఫీస్ లో రూ 399కే 10 లక్షల ప్రమాద భీమా పథకాన్ని తీసుకోవడంతో అతడి కుటుంబానికి భీమా కింద 10 లక్షలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన చెక్కును మంగళవారం వెంకటేష్ కుటుంబ సభ్యులకు సూపరింటెండెంట్ అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సంవత్సరానికి రూ.399 భీమా తీసుకుంటే ప్రమాదవశాత్తు మృతి చెందిన వారి కుటుంబానికి 10 లక్షల రూపాయలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈనెల 30 తారీకు వరకు ప్రత్యేక శిబిరాల ద్వారా ప్రతి



పోస్ట్ ఆఫీస్ లో ఈ భీమా తీసుకోవచ్చునని తెలిపారు. పోస్టల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ సూపరింటెండెంట్ శ్రీనివాస రావు సూచించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాధ గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ కుటుంబం లోని అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ బీమా చేసుకోవాలని మరణించిన కుటుంబానికి ఆసరాగా ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసిస్టంట్ సూపరిండెంట్ కిరణ్ రెడ్డి , ఐపిపిబి బ్రాంచ్ మేనేజర్ తొర్తి రాజేష్, రేవతి , మెయిల్ ఓవర్సీస్ శ్రీనివాస్, బీపీయం షబ్బీర్, పోస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వంతెనను బాగు చేసుకున్న యువత

**వరదయ్యపాలెం**

సామాజిక బాధ్యతతో కదూరు యువత ముందుకు కదిలింది. బీటలు వారిన వంతెనపై ఏర్పడ్డ గుంతలను పూడుస్తూ, వర్షపు నీరు వెళ్లడానికి విపరీతంగా పేరుకుపోయిన చెత్తను తీస్తు ఆదర్శంగా నిలిచారు కదూరు యువకులు..

తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలంలోని కదూరు సమీపంలో ఉన్న వంతెన పై ఏర్పడ్డ గుంతలతో ఇటీవల ప్రతి రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో కదూరు గ్రామానికి చెందిన కొంతమంది యువకులు సామాజిక బాధ్యతతో బ్రిడ్జిపై ఏర్పడ్డ గుంతలను పుడుస్తూ.... బ్రిడ్జి పైనున్న మట్టి, చెత్తను శు భ్రపరిచారు. వందల కొద్ది భారీ వాహనాలు ప్రయాణం సాగించే ఈ దారిలో కీలక వంతెనలలో ఇది కూడా ఒకటి... వంతెన పైభాగం పై లెక్కలేనన్ని గతుకులు ఏర్పడడం కొన్నిచోట్ల లోపలి భాగం కూడా కనబడుతుండడంతో ప్రయాణించే సమయాల్లో గమనించకుండా వెళితే అంతే సంగతులు. మరీ ముఖ్యంగా రాత్రివేళలో భారీ వాహనాలు వేసుకుని వచ్చే లైట్ల కాంతితో ఎదురుగా వచ్చే ద్విచక్ర వాహనదారులు గుంతలను గమనించుకోలేని పరిస్థితిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టకపోవడం గమనార్హం. దాదాపు రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ వంతెన ప్రయాణపరంగా, రవాణా పరంగా ఎంత కీలకమో తక్షణమే గుర్తించి మరమ్మత్తులు చేయాలని స్థానికులు కోరుతున్నారు

# వైసీపీ శ్రేణులు రాజీకి రమ్మని రాయబారాలు పంపుతున్నారు

**వివేకా కేసులో అప్రూవర్ దస్తగిరి సంచలన వ్యాఖ్యలు..**

**కడప**

ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి బాబాయి, మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో అప్రూవర్గా ఉన్న దస్తగిరి ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. వైసీపీ శ్రేణులు రాజీకి రమ్మని రాయబారాలు పంపుతున్నారని సంచలన విషయాన్ని వెల్లడించాడు. పెద్దమనుషులతో రాజీ అయితే డబ్బులు కూడా ఇప్పిస్తామంటూ ప్రలోభ పెట్టారని తెలిపాడు. తాను చావడానికైనా సిద్ధం.. కానీ రాజీ ప్రసక్తే లేదని కుండబద్ధలు కొట్టినట్టు చెప్పాడు. వివేకా



హత్యకేసులో ఒక్కొక్కరు అరెస్ట్ అవుతున్నారని, తనను లొంగతీసుకునేందుకు వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నార దస్తగిరి చెప్పాడు. తాను ఎవరికి లొంగను.. కోర్టులోనే తేల్చుకుంటానని తన అభిప్రాయాన్ని చెప్పాడు. తనపై వైసీపీ నేతలు కక్షకట్టి వేధిస్తున్నారని వాపోయాడు. అక్రమ కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు.

# ఈటలకు ఢిల్లీ నుంచి ఫోన్ ?

**హైదరాబాద్ :**

తెలంగాణ రాజకీయాలు ఆసక్తికర మలుపులు తిరుగుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రము లో ఏ నోట విన్న ఈటల.. ఈటల.. తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడీ పేరు మార్మోగుతోంది.. గత కొన్నిరోజులుగా తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యంగా బీజేపీలో నెలకొన్న పరిస్థితులతో ఈటల రాజేందర్ ఏం చేయబోతున్నారు..? కీలక నిర్ణయమే తీసుకుంటారా..? గత కొన్నిరోజులుగా ఆయన అసంతృప్తితో రగిలిపోతుండటానికి కారణాలేంటి..? బీజేపీలో కంటిన్యూ అవుతారా.. లేకుంటే కాంగ్రెస్ గూటికి చేరుతారా..? లేకుంటే ఈటల సతీమణి జమున ఒక్కరే కాంగ్రెస్ తీర్థం పుచ్చు కుంటారా..? ఇన్నిరోజులుగా ఊరించిన కీలక పదవి కథేంటి..? పొమ్మనలేక పొగపెడు తున్నారన్న వార్తల్లో నిజమెంత..? బీజేపీలో కంటిన్యూ అవుతూనే తనకున్న చేరికల కమిటీ పదవికి రాజీనామా చేస్తారా..? ఇలాంటి మరెన్నో ప్రశ్నలకు ఈటల దంపతుల నుంచి సమాధానాలు వస్తాయని అభిమానులు అనుకున్నారు కానీ.. సడన్గా ఈటల తన తన ప్రెస్మీట్ను రద్దు చేసుకున్నారు. దీంతో ఈటల రాజేందర్ పొలిటికల్ డైలమా కంటిన్యూ అవుతూనే ఉంది.. అయితే జమున మాత్రమే మీడియా ముందుకొస్తున్నారు. దీంతో ఆమె ఏం మాట్లాడుతారు..? కీలక ప్రకటన ఏమైనా ఉంటుందా..? అని కార్యకర్తలు వేయికళ్లతో వేచి చూస్తున్నారు.

కొద్దిరోజుల క్రితం దిక్కుతోచని స్థితిలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. కర్నాటక ఎన్నికల్లో విజయం తర్వాత ఒక్కసారి పరిస్థితులు మారిపోయాయి. మరోవైపు.. దూకుడు మీదున్న బీజేపీ డీలా పడిపోయింది. నేతలు ఎప్పుడెలా అడుగులేస్తారో తెలియని పరిస్థితి. పొంగులేటి, జూపల్లి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడానికి సర్వం సిద్ధం చేసుకున్నాక రాష్ట్ర రాజకీయాల్లో మరింత వేడెక్కాయి. సరిగ్గా ఈ సమయంలోనే ఈటల దంపతులిద్దరూ మీడియా ముందుకు రావాలనుకున్నారు. దీంతో తాజా రాజకీయ పరిణామాలు, బీజేపీలో నెలకొన్న పరిస్థితులు, అసలు బీజేపీలో కొనసాగే పరిస్థితి ఉందా లేదా..? అసలు అందరూ అనుకున్నట్లుగా ఆ కీలక పదవి సంగతేంటి..? ఇలా అన్ని విషయాలపై ఈటల మాట్లాడుతారని అందరూ భావించారు కానీ.. ఎందుకో రాజేందర్ సడన్గా ప్రెస్మీట్ రద్దు చేసుకున్నారు. వాస్తవానికి.. ఈటల కాంగ్రెస్లో చేరాలని చాలా రోజులుగా అనుచరులు, అభిమానులు ఒత్తిడి తెస్తున్నారు..

## కౌశిక్ రెడ్డిని భర్తరఫ్ చేయాలి

**మేడ్చల్**

తెలంగాణ ప్రజలు అనుకుంటే ఏ పార్టీతో అయినా కెసిఆర్ ను ఓడించడం సాధ్యమే.ఈటల రాజేందర్ ఏ పార్టీలో ఉన్నా సంతృప్తిగా ఉన్నారు. ఆయన ప్రజలకోసం పనిచేస్తారని ఈటల భార్య ఈటల జమునల అన్నారు. మంగళవారం నాడు ఆమె మీడియాతో మాట్లాడారు. మేం ఎప్పుడు పదవుల కోసం ప్రాకులాడ లేదు. కాళ్ళు మొక్కుడు మా రక్తంలో లేదు. నేను ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాను. పరోక్షంగా ఉండి.. ఈటల రాజేందర్ కు అండగా ఉంటా. ఈటల రాజేందర్.. ప్రతిష్ఠ దిగజారింది, మెప్పు కోసం మాట్లాడబోతున్నారు అని వాట్స్ అప్ లో దుతున్నారు. కానీ ఈటల ప్రతిష్ఠ ఎప్పుడు దిగజారదు. ఈటల ఉద్యమ కారుడు. ప్రజలు మమ్ముల్ని కాపాడుకుంటారు. లంగ,దొంగ పనులు చెయ్యలేదు. చిల్లర గాల్లు ఎన్నికల సమయంలో ఈటల కాళ్ళకు కట్టు కట్టుకుంటారు. జమున కొంగు పట్టుకొని అడుగుతారు అన్నారు. మేము అలాంటి పనులు చేసే వాళ్లం కాదు. టజల్లో ఉన్నాం ప్రజల మెప్పు పొందాము. చిల్లర, పిచ్చి కుక్కను ఎమ్మెల్సీని చేసి హుజూరాబాద్ మీదకు కెసిఆర్ వదిలిపెట్టారు. మహిళలను కించ పరుస్తారు. అమ్మ నాన్న సంస్కారం నేర్పారు అన్నారు. మరి కెసిఆర్ ఈ పిచ్చి మాటలు నేర్పించారా ? ఎన్ని మాట్లాడితే అన్ని ఎక్కువ పదవులు వస్తున్నాయా ? గోల్డ్ మెడల్స్ ఇస్తున్నారా? 2014 లో కట్టిన అమరవీరుల స్థూపంను ఆయన పేరు లేదు అని కూల్చి వేశారు.. అమరవీరుల స్తూపం తాకే అర్హత లేదు. తెలంగాణ ప్రజలందరూ గమనిస్తూనే ఉన్నారు. మా మీద అక్కస్సుతో ఇదంతా కెసిఆర్ చేయిస్తున్నారు. కౌశిక్ రెడ్డికి ఎమ్మెల్సీగా గా ఉండే నైతికత లేదు. కెసిఆర్ ఆయన్ను వెంటనే భర్తరఫ్ చెయ్యాలి. గవర్నర్ ను తిడితే మండలించల్సింది పోయి పదవులు ఇచ్చారు. చెల్పూర్ సర్పంచ్ మహేందర్ గౌడ్ ను అక్రమ కేసు పెట్టి అరెస్ట్ చేసి.. పోలీసులతో కొట్టించారు.. దాన్ని వీడియో కాల్ చేసి మరి చూయించాలని ని ఒత్తిడి చేసిన రాక్షసుడు. మహిళా ఉద్యోగుల పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. పంచాయితీ సెక్రటరీనీ యూజ్ లెస్ ఫెల్లో అని తిట్టారు. రైతును సిగ్గు లేదా అని తిట్టారు. రైస్ మిల్లులు దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నారు . 20 కోట్లు పెట్టీ ఈటల రాజేందర్ ను చంపేస్తా అని కౌశిక్ రెడ్డి చెప్తున్నారు అంటే అది కెసిఆర్ అండతోనే. నీతో చంపించడానికేన మేము ఉద్యమం చేసింది. చెప్పకుంటే వినకపోతే చంపడానికి కూడా కెసిఆర్ రెఢీ అవుతున్నారని అనుకోవాలా ? ఆర్థికంగా అనేక ఇబ్బందులు పెడుతున్నారు. మా మొత్తం దుర్మార్గులను ఎదురిస్తున్న అన్నందుకు సంతోషంగా ఉన్నాం. చిన్న కులాల వారు అనా చిన్న చూపు.. ఎవరి మాట్లాడిన మహిళలు క్షమించరు చెప్పుల దండ వేస్తారు. ఊర్లో తిరగనివ్వరు. శాడిస్ట్ లకు పోలీసులు మద్దతు ఇవ్వకండి. పిచ్చికుక్క అని హుజూరాబాద్ ప్రజలు అందరు అనుకుంటున్నారు. తిట్టి కొట్టి ఇప్పుడు మళ్లీ ఫేక్ అంటున్నారు. క్షమాపణ చెప్పమని అంటే చెప్పకపోతే ఎలా ? ప్రజలారా కళ్ళు తెరవండి. ఇలాంటి ముఖ్యమంత్రి ఉంటే మనకు రక్షణ ఉండదు. ఈ దుర్మార్గ ప్రభుత్వాన్ని మహిళలందరం కలిసి ఇంటికి పంపిద్దాం. కెసిఆర్ మా ఇంట్లో.. నా భర్త, పిల్లలు ఎవరు రక్తం బొట్టు పడినా మీదే బాధ్యత. అనిఅమె అన్నారు.


## రెండో రోజు రూ.1278.60 కోట్లు

**హైదరాబాద్**

రైతుబంధు నిధులను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఒక ప్రకటనలో రైతాంగానికి విజ్ఞప్తి చేసారు. సాగునీటి రాక, ఉచిత కరంటుతో సాగుకు యోగ్యమైన ప్రతి ఎకరా సాగులోకి వచ్చింది. వ్యవసాయ రంగం చుట్టూ అల్లుకున్న రంగాలు బలోపేతం అవుతున్నాయి. రెండో రోజు రూ.1278.60 కోట్లు, 16 లక్షల 98,957 మంది రైతుల ఖాతాలలో జమ అయ్యాయి. రెండు రోజులలో 39,54,138 మంది రైతుల ఖాతాలలో 1921.18 కోట్లు జమ చేసాం. రైతు బంధు పథకంతో తెలంగాణలో సాగువిప్లవం కొనసాగుతోంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో ముందుచూపుతో వ్యవసాయానికి మొదటి ప్రాధాన్యం ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు. ఆహారశుద్ది పరిశ్రమలతో రూపుమారనున్న తెలంగాణ వ్యవసాయ రంగం. ఆరుగాలం కష్టపడే రైతు నాలుగు పైసల లాభం కండ్ల చూడాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్ష.









Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950